
నవయుగ

పుటి 1 | 1947, ఏప్రిల్ | సంచిక 2



YOUTH UNITE! FORWARD FOR LASTING PEACE!
WORLD FEDERATION OF DEMOCRATIC YOUTH

ధ్రరాష్ట్ర విద్యార్థి యువజన మాసపత్రిక

నవయుగ

ఆంధ్ర రాష్ట్ర విద్యార్థి, యువజన మాస పత్రిక.

సంపుటి 1 | 1947 ఏప్రియల్ | సంచిక 2

★ సంపాదకీయం

యువజనోద్యమంలో చీలికలు - యువకుల కర్తవ్యం

ప్రధమసారిగా ఆంధ్ర యువజన ఉద్యమంలో చీలికలు 1942లో ఏర్పడినవి. అంతవరకు యువకుల రాజకీయ, వైజ్ఞానిక, సాంఘికాభివృద్ధికి పాటుబడుచున్న యువజన సంఘాలకు పోటీగా యువజన కాంగ్రెసు స్థాపించబడింది. యువజన కాంగ్రెసు స్థాపించబడి నిండా ఐదేండ్లుకాకముందే ఈ సంస్థలో నేడు చీలికలు యేర్పడ్డాయి యువకుల నెదుర్కొను సమస్యలనెల్ల ఐక్యంగా పరిష్కరించేందుకు బదులు, దినదినాభివృద్ధి చెందుతున్న యీ చీలికలు యువకులను నిరుత్సాహపర్చక మానవు నేడు నూతనంగా యువజన కాంగ్రెసులో ఏర్పడిన చీలికలకు తెరవెనుకనున్న నాటకమేమిటి? దీనిని లోతుగా తరిచి పరీక్షించినపుడే ఐక్య యువజనఉద్యమ నిర్మాణమునకు యువకులం సరైన మార్గాన నడువగలం

యువజన కాంగ్రెసు స్థాపన, యువకుల అభివృద్ధికి పూను కొని కృషిచేయవలసిన కార్యక్రమముపై కాక, యువజన సంఘాలలో కమ్యూనిస్టుయువకులు పనిచేస్తున్నారు కనుక దానికి పోటీగా మరియొక సంస్థను స్థాపించవలయు ననెడి కమ్యూనిస్టు గుడ్డివ్యతిరేకతతో స్థాపించబడింది అందుచే యువజన కాంగ్రెసు ఏర్పడిన 5 సం॥లలో, నేటివరకు ఈ సంస్థ తరపున యువకుల శారీరక, వైజ్ఞానికాభివృద్ధికి వీరమలుపర్చిన కార్యక్రమం శూన్యమని చెప్పకతప్పదు. యువకులఅభివృద్ధిని కోరి, ఒకస్వతంత్ర పంధాలో యువజనోద్యమమును నిర్మించే కార్యక్రమంలేదు. వివిధ రాజకీయాభిప్రాయములు కలిగిన యువకులుసైతం, కలిసి యువజనాభివృద్ధికి స్వతంత్ర యువజనోద్యమమును నిర్మించవలయుననెడి సూత్రాన్ని యువజన కాంగ్రెసునాయకులు ఆదినుండీ తిరస్కరిస్తూ వచ్చారు. యువజన కాంగ్రెసు, కాంగ్రెసు అనుబంధ సంస్థగామాత్రమే వుండాలనెడిపంధాను వీరవలంబించారు దీనితో కాంగ్రెసు సంస్థలోని ముఠాలు, గ్రూపులు యువజన కాంగ్రెసులోకూడా పొడసూపాయి. ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసులోని పట్టాభి - ప్రకాశం వర్గరాజకీయాలు యువజన కాంగ్రెసులోకూడా తీవ్రరూపం దాల్చాయి. ఈ ముఠా రాజకీయాలను పోరాడి నిర్మూలించి యువకులందరినీ ఐక్యపర్చియుంచగల రాజకీయ పంధాయైనా యువజన కాంగ్రెసు నాయకులకు లేకపోయింది. అందుచే ముఠారాజకీయఊబిలోకి దిగజారారు

యువజన కాంగ్రెసులో అధికారములోనున్న కాంగ్రెసు సోషలిస్టు వర్గం, ప్రకాశం మంత్రివర్గాన్ని విమర్శించుతోందనీ, కాంగ్రెసు వ్యతిరేకపంధా అవలంబించుతోందనీ, రంగా ముఠా - అధికారంలోవున్న వర్మ ముఠాను విమర్శించ ప్రారంభించారు. అధికారంలోవున్న ముఠాకు మెజారిటీలేదనీ, సభ్యులు కోరినా కౌన్సిల్ సమావేశం జరుపుటలేదనీ, వీరు సవాల్‌చేయ ప్రారంభించారు. దీనికి జవాబుగా అధికారంలోవున్న వర్మ గ్రూపువారు యిదంతా యువజన కాంగ్రెసు విచ్ఛిన్నానికి రంగా గ్రూపుచేయు కుట్రలనీ, ఈ గ్రూపు నాయకులకు యువజన కాంగ్రెసు నుండి ఉద్వాసం చెప్పటం ఎప్పుడో జరిగిందనీ, కాన వారి ప్రయత్నాలకు ఎవరూ చేయూతనివ్వవద్దనీ ప్రకటించారు. పత్రికలద్వారా

ప్రకటనలు, జవాబులు, తిరుగు జవాబులు కొంతకాలం నడిచినాయి. తరువాత రంగా గ్రూపువారు, భీమవరంలో ప్రత్యేక సమావేశమొకటి జరిపారు ఇందులో ఏలూరు యువజన కాంగ్రెసు సభలో ఎన్నుకోబడిన కార్యనిర్వాహక వర్గాన్ని రద్దుచేస్తూ తీర్మానించారు నూతన కమిటీని ఎన్నుకొన్నారు వర్మ గ్రూపువారు ఏలూరులో ఎన్నుకొనబడినదే అధికార సంస్థయనీ, భీమవరం కమిటీ విచ్ఛిన్నకుల సంస్థ యనీ ప్రచారమునకు పూనుకొన్నారు ఈ విధంగా యువజన కాంగ్రెసు రెండు మురాల క్రింద - కాంగ్రెసులోని రెండు మురాల తోకలుగా చీలిపోయాయి ఈ చీలికలేర్పడినవిధము పరికించితే కాంగ్రెసు మురా రాజకీయములు మినహా, యువకుల సమస్యలేమీ వీరికి పట్టలేదు. యువజన కాంగ్రెసును స్వతంత్ర సంస్థగా పనిచేయించాలనే దృక్పథం యీ నాయక శిఖామణులకు లేకపోవుటచే చీలికలే ప్రధానంగా ఇచ్చట ప్రత్యక్ష మయాయి.

యువజన కాంగ్రెస్ నాయకులు తాము సేవచేయవలసిన యువకులమాటే ఎత్తకుండా, తమలో తాము కీచులాడుకొను కాలంలో యువజన సంఘాలు ఏమిచేశాయి? యువజన సంఘాలు పుట్టుకనుంచీ స్వతంత్రసంస్థలుగా పనిచేస్తూ యువకుల అభివృద్ధికి తమశక్తి కొలదీ కృషిచేస్తున్నాయ్. రాత్రి పాఠశాలల నేర్పరిచి నిరక్షరాస్యులకు విద్యనేర్పాయి. యువకుల విజ్ఞానాభివృద్ధికి పత్రికా పఠన గ్రూపులు నేర్పరచాయి గ్రంథాలయాలను ఏర్పరచాయి పండుగల సమయములలో జూదం, పందాలు మున్నగు దురభ్యాసములకు లోనుగాకుండా యువకులకు ప్రత్యేక ఆటలపోటీలను ఏర్పరచాయి గ్రామాలలో వైజ్ఞానిక దళముల నేర్పరచి నూతన విజ్ఞాన దీపికలను వెలిగించుతున్నాయి, ఈ కార్యక్రమములో అన్ని వర్గాల యువకులూ పాల్గొంటున్నారు ఆటల కార్యక్రమము తీసుకొని ప్రతి సంవత్సరము జిల్లా తాలూకా ఆటల పోటీలను జరుపుచున్నారు ఈ కార్యక్రమముద్వారా మన సమాజంలో వెనుకబడ్డ యువకులుకూడ ఉత్సాహితులై ముందుకురుకుచున్నారు వివిధవర్ణములవారు కలసి ఆటల పోటీలలో పాల్గొని సనాతన కట్టుబాటులనెల్ల తుత్తునియలు చేయుచున్నారు నూతనజీవితం, సమానత్వం యువకులలో వ్యాప్తి చెందుటకు ఈ కార్యక్రమ మెంతగానో తోడ్పడుతోంది ఒకటేమిటి — యువకుల నెదుర్కొన్న ప్రతి సమస్యపైనా స్వతంత్ర పంథాతో యువజన సంఘాలు ముందుకు సాగిపోతున్నాయ్ అందుచే వేలకొలది యువకులు నూతనంగా యువజన సంఘాల పలుకుబడిక్రిందకు వస్తున్నారు. నేడు ఆంధ్రదేశములో వివిధ జిల్లాలలో కన్పించే యువజన సంరంభమే దీనిని రుజువు చేస్తూంది.

ఈ పంథా స్పష్టపర్చేదేమిటి? యువకులం — మనమెన్ని రాజకీయాభిప్రాయములకు చెందివున్నా యువజనుల నెదుర్కొను సమస్యలపై ఐక్యమై కృషిచేయాలని అప్పుడే బలమైన యువజనోద్యమాన్ని నిర్మించగలం.

ఇందుకు నేడు మనల నెన్నో సమస్యలు ఎదుర్కొంటున్నాయ్ దేశనాయకులు సామ్రాజ్యవాదులచే తయారు చేయబడ్డ ప్లానును అంగీకరించారు దీని విషబీజాలు వృక్షరూపమై నేడు మనదేశాన్ని సర్వనాశనం చేయుచున్నవి. ప్రతిచోటా అంతఃకలహాలు సామ్రాజ్యవాదులచే రెచ్చగొట్టబడుచున్నాయ్. మరియొకప్రక్క రైతుకూలీలు తమ న్యాయమైన హక్కులకోసం వీరోచితంగా పోరాడుచున్నారు. ఇందుకుగాను వీరిపై మన చరిత్రలో సాటిలేని నిర్బంధవిధానం అమలుజరుపబడుతోంది బ్రిటను తొత్తులయిన సంస్థానాధీశులు ప్రజలను జలగల్లాగా పీల్చుకుతింటున్నారు ఒక కోటి ఆంధ్రప్రజానీకాన్ని నేటికీ నైజాం ఫాసిస్టు, బ్రిటిషుతొత్తు కసాయివాడిలాగా కోసుకుతింటున్నాడు. ఈ సమస్యలన్నీ నేడు ఆంధ్రయువకులను కదుల్చుటలేదా? తీవ్రభేదాభిప్రాయములు గల్గిన ప్రతియువకుడూ యీ సమస్యల పరిష్కారం కొరకు ఐక్యమై కృషి సల్పలేడా? లేనిచో మన మందరం కలలుగనే అంతిమ ఐక్యపోరాట మెట్లుసాధ్యం? భారతదేశంనుండి సామ్రాజ్యవాదులకు చెల్లుచీటీ యిచ్చుటకు యిదొక్కటే మార్గం

మరియొకప్రక్క చూస్తే యువకులకు నేటి సమాజంలో సుఖజీవితానికి తావేలేదు లక్షలకొలది నిరుద్యోగులగుచున్నారు కళాశాలలనుండి బయటకు వచ్చేవారికి ఉద్యోగములు లేవు మన పట్టణాలలో, గ్రామాలలో యువకులకుండవలసిన కనీస సౌకర్యాలు, ఆటల వసతులు, గ్రంథాలయాలు మున్నగునవి మృగ్యం మనహక్కులివియని నోరు విప్పి అడిగితే ఎదురుగా ప్రజాభక్షణచట్టం ఊహకందని నిర్బంధవిధానం—ఇదీ మన జీవితం ఈ సమస్యల పరిష్కారమునకు కృషిచేయుటలో మన భేదాభిప్రాయములకు తావెక్కడ? ఇందులో ప్రతిఒకసమస్యపై ఐక్యమై పోరాడనిది హక్కులు సాధించలేం. ఈనగ్నసత్యాన్ని గుర్తించక మురా, పార్టీకక్షలకు లోనైతే మనకు భవిష్యత్తు శూన్యం. మనం యీ సమస్యలపై కలసి కృషిచేసినప్పుడే మనలో ఏర్పడిన చీలికలను పూడ్చగలం. ఇట్టి ఐక్యతకు యువజనసంఘాలు శక్తికొలదీ కృషిసల్పుతున్నాయి యువజనోద్యమంలో ఐక్యత నిర్మించుటకూ, మహత్తర కార్యసాధనకూ మీ సహాయాన్ని కోరుచున్నాము. అట్టి ఐక్యఉద్యమనిర్మాణమునకు యువకులెల్లరు యువజనసంఘాల్లో చేరి, కృషి సల్పమని మా విజ్ఞప్తి.

నాట్యకళా ప్రపూర్ణ
శ్రీ బళ్ళారి టి. రాఘవ

డాక్టర్. రాజారావ్
ఆర్గనైజర్ :
ఆంధ్ర ప్రజా నాట్యమండలి

['నాట్యకళా ప్రపూర్ణ' మనను విడచిపోయి సంవత్సరమైనది. ఎన్ని పన్నులున్నా. ఎంత పని తొందరలోయున్నా యువకులయిన మన ఆహ్వానాన్ని రాఘవాచారిగారు తిరస్కరించి ఎరుగరు. ఆంధ్రనాట్యకళాభివృద్ధికి వారి ఆశలన్నీ యువకులపైననే పెట్టుకొన్నారు నాట్యకళా ప్రపూర్ణునియెడ మనకున్న గౌరవసూచకంగా మన వైజ్ఞానిక కార్యక్రమమును రెట్టింపు పుత్సాహంతో ముందుకు కొనిపోదాం. మనపై మననాట్యకళా ప్రపూర్ణుడు పెట్టుకొనిన ఆశలను ఆడియాసలు చేయరాదు. సం॥]

ఆంధ్ర నాటక పితామహులైన శ్రీ ధర్మవరం కృష్ణమాచార్యులుగార్కి మన రాఘవాచారిగారు మేనల్లుడు. న్యాయవాదిగా తాను ప్రాక్టీసు చేసుకుంటూ కళాసేవ చేశారు. బళ్ళారిలో పబ్లిక్ ప్రాస్యీకూటర్‌గా కూడా పనిచేశారు

సాటిలేని కళావేత్త

వీరు సాహిత్య, నాట్యకళల్లో ఆరితేరిన సిద్ధహస్తులు. బాహుక, పఠాన్, శివాజి, రామదాస్, దుర్యోధన, చాణుక్య మొదలగు అనేక వేషాల్లో అసామాన్యమైన మెప్పును గడించారు తెలుగు నాటకాలేగాక ఇంగ్లీషు నాటకాల్లోగూడా చాలా ప్రతిష్టను సంపాదించారు. వీరి "ఒథెల్లో" వేషంతో పోటీచేసే నటకుడు లేడని ప్రతీతి, గురుదేవు రవీంద్రనాథ ఠాగూర్ మన రాఘవుని నటనా చాతుర్యాన్ని ప్రపంచానికి చాటారు.

రంగ శిల్పంలో ఆంధ్రు లెవరికీ తీసిపోని యశాన్ని సంపాదించిపెట్టిన కీర్తికాయుడు. ఇది ఆంధ్రులెంతో గర్వించదగిన విషయం. నాట్యకళా శిల్పానికి మెరుగులు దిద్దిన ధీశాలి. సాత్వికాంగికాభినయాల్లో రసపుష్టిని ఉన్నతస్థాయిలో నిలపగల కళావేత్త — క్రోధంలో వారినేత్రాలు అగ్నికణాలు — కరుణలో వారికళ్ళు కమలాలు — వారి భీభత్స రసానికి రంగస్థలం దద్దరిల్లేది వాచికాభినయంలో ఏమేటి మాటను యెక్కడెక్కడ యెంతకాలము నిలపాలో, యేమాట యెట్లా యెత్తి పలకాలో (ఆరోహణ — అవరోహణలు), యే అక్షరమును యెట్లా ఉచ్చరించాలో వీరిపాత్రలో చక్కగా వ్యక్తమయ్యేవి మనస్సులోనుండే భావానికి భిన్నంగా ముఖకవళికలు కనబరచు సమయం తటస్థించినపుడు అట్టివిరుద్ధభావాన్ని అతినేర్పుతో అభినయించేవారు. వారి శరీరం ప్రతి అణువూ ప్రతిచలనంతో తొణికిసలాడేది పద్యం చదివేటప్పుడు లేనిపోని గింగుర్లు పెట్టి చాంతాడంత అనవసర ఆలాపనలు చేయకుండా స్ఫుటంగా, దాని అర్థం ప్రేక్షకులందరికీ తెలిసేటట్టు, ఆపవలసినచోట ఆపుతూ, చదవడం వీరిలో ప్రత్యేకత. నటనాకౌశల్యంలో వీరిదగ్గర నేటి నటులు నేర్చుకోవలసిన విషయాలు చాలా వున్నాయి.

కళాభ్యుదయం

ఆంధ్రనాటక రంగంలో స్త్రీపాత్రలు స్త్రీలే ధరించాలన్నసూత్రం ప్రథమంలో ప్రవేశపెట్టి గెలుపొందినవ్యక్తి, పౌరాణిక, చారిత్రాత్మక నాటకాలే కాకుండా సాంఘిక నాటకాల్లోకూడా వీరు పేరుగడించారు. (ఉ॥ "తప్పెవరిది" "తీరనిసమస్య" మొ నాటకాలు) "రైతుబిడ్డ", "చండిక", "ద్రౌపది" మొదలగు చిత్రాలలో యశాన్ని గడించారు. వీరి నటనాశక్తితోబాటు దేశ కాలానుగుణ్యంగా కళాభ్యుదయానికి వీరుచేసినసేవ అపారము. ఆంధ్ర నాటకరంగంలో నూతనశక్తిని ప్రవేశపెట్టాలని వీరి మనస్సు ఎప్పుడూ బాధిస్తుండేది. ఆంధ్రనాటక కళాపరిషత్సభల్లో అనేకమార్లు తనహృదయంవిప్పి ఆవేశంతో కళాభ్యుదయానికిమార్గాలను సూచిస్తూ మొరపెట్టుకోవడం జరిగింది కాని పరిషత్తుకి దినసరి కార్యక్రమం లేకపోవడంచేత ఆచరణలోకి రాలేదు.

కళ ప్రజలకొరకే

మరొక సంవత్సరానికి చనిపోతారనగా ఒకయువజన మహాసభకు అధ్యక్షత వహిస్తూ, అచ్చటి యువకులిచ్చిన కళారూపాల్ని చూసి,ముగ్ధులయ్యారు. ప్రజల నైతిక, రాజకీయ శక్తుల్ని బలపరచడానికి అనుగుణ్యమైన కళారూపాలను తీసుకురావటం యీనాడెంతో అవసరమని ఉద్ఘాటించారు. ప్రజాజీవితాన్ని చిత్రించే పాటలు, నాటకాలు, బుర్రకథలు రావడం కళాభ్యున్నత్యానికి నూతన శకారంభమని పొగిడారు. యువకుల్లో వచ్చిన ఈ నూతన చైతన్యం దేశకళ్యాణానికి శుభసూచకమని వాత్సల్యంతో అభినందించారు, ఆనందాశ్రు బిందువులతో యువకుల్ని ఆశీర్వదించారు.

(మిగతా 7వ పేజీలో)

వీట్-నామ్ యువకుల

(మా ప్రత్యేక విలేఖరి)

అఖిల ఆసియా మహాసభకు వీట్‌నాం ప్రజాప్రతినిధులుగా ప్రొఫెసరు ట్రాన్-వాన్-గ్యావ్, డాక్టరు "ట్రాన్-వాన్ లియావ్" హాజరయ్యారు. ప్రొఫెసరు గ్యావ్ దక్షిణ యుద్ధరంగ సేనానాయకుడు 50 వేల గెరిల్లాసైనికులకు అధిపతి, జపాను ఫాసిస్టులు తమదేశమును ఆక్రమించుకొన్న రోజులలో ఏర్పరిచిన జాతీయ ప్రతిఘటన సమితికి అధ్యక్షుడు. డాక్టరు లియావ్ జాతీయ అసెంబ్లీ ఉపాధ్యక్షుడు, ఈ యిరువురూ వీట్‌నాం ప్రజాప్రభుత్వ అధ్యక్షుడయిన హో-చి-మిన్‌కు కుడిభుజం వంటివారు వీరు ఆసియా మహాసభకు 5 రోజులు ఆలస్యంగా చేరారు.

వీట్‌నాం ప్రజాప్రభుత్వ ప్రతినిధులు ఎవరూ ఆసియా మహాసభకు హాజరు కాకుండా చూడవలయునని ఫ్రెంచి సామ్రాజ్యవాదులు నానాప్రయాసలు పడ్డారు ప్రజా ప్రతినిధులు ఆసియాసభకువచ్చినచో, తమగుట్టును బైటపెడతారని, స్వతంత్ర కాముకులైన ఆసియాదేశ యితర ప్రజలతో సన్నిహిత సంబంధముల నేర్పరచుకొనగల్గుతారని, ఫ్రెంచిసామ్రాజ్యవాద మురాకు భయం. తమ ప్రచారముకొరకు తమ తొత్తులను కొందరిని ఇండోచైనానుండి ప్రజాప్రతినిధులుగా ఆసియాదేశాలసభకు ఫ్రెంచి సామ్రాజ్యవాదులు పంపారు. వీట్‌నాంలో అనేక ముఖ్యపట్టణాలను మాత్రం ఫ్రెంచిసైన్యం స్వాధీనం చేసుకోగల్గింది తద్వారా ఇతర దేశములలో ప్రజాప్రభుత్వమునకున్న సంబంధాలను తెగగొట్టగల్గారు. ఇండియా వచ్చుటకు యీ ప్రతినిధివర్గం రాత్రులందు తొమ్మిది ఫ్రెంచి సైనికుల దిగ్బంధనముల నుండి తప్పించుకొని రావల్సివచ్చింది. ఈ ప్రయాణంలో ప్రతినిధివర్గ వార్తాహరుడు ఫ్రెంచి సామ్రాజ్యవాదుల తుపాకి గుండ్లకు బలియైనాడు. మిగతా యిరువురూ బాంకాంగ్ చేరి ఇండియాకు వచ్చారు.

ఇన్ని కష్టములకు ఓర్చి ఢిల్లీసభకు హాజరయిన వీట్-నాం ప్రజానాయకుల ద్వారా వారి యువజనవుద్యమ కార్యకలాపాలను విందామని బయలుదేరాను అవతల పని ఒత్తిడియున్నా, విద్యార్థి, యువజనసంఘ ప్రతినిధినని వినగనే ఇంటర్‌వ్యూ యిచ్చారు. వీట్-నాం యువజన ఉద్యమాన్ని గురించి యిరువురు నాయకులు తెల్పిన వివరాలను క్రింద పొందుపరుస్తున్నాను

* * *

ప్రశ్న: వీట్-నాంలో ప్రజాప్రభుత్వం ఏర్పడిన ఒక సంవత్సరంలోనే నిరక్షరాస్యుల సంఖ్యను నూటికి 85 నుండి 20 మందికి తగ్గించగల్గినారని విన్నాం. ఇంత తక్కువకాలంలో యింత మహత్తరమైన విజయం ఎట్లు సాధించగల్గారు? ఈ ఉద్యమంలో యువజనుల పాత్ర ఏమిటి? దేశరక్షణ, దేశపునర్నిర్మాణము మున్నగు ఇతర కార్యక్రమములలో మీ దేశయువకులు ఎట్టి పాత్ర నిర్వహించుచున్నారు?

జవాబు: "మా ప్రజాప్రభుత్వాధ్యక్షుడు హో-చి-మిన్ దేశప్రజలకు నేటి ప్రధానశత్రువులుముగ్గురన్నారు 1 సామ్రాజ్యవాదులు 2 నిరక్షరాస్యత 3 కరువు. యువకుల బాధ్యత యీ మూడు పిశాచములను దేశం నుండి పారదోలటం అని మా అధ్యక్షుడు నిర్వచనం చేశాడు. ఈ పిలుపు నందుకొని దేశంలోని యువజనసంఘం కార్యక్రమానికి దిగింది.

విద్యావ్యాప్తి - యువజనుల కృషి

నిరక్షరాస్యతను పోగొట్టుటకు ప్రత్యేకకమిటీ నొకదానిని నియమించింది గ్రామములలో పాఠశాలలు పెట్టి నిరక్షరాస్యులకు చదువు చెప్పుటకు ఉపాధ్యాయులకు యీ సమితి పిలుపునిచ్చింది. ఒక్క సం॥లో 80 వేలమంది విద్యార్థులు, యువకులు ఈ బాధ్యతను ఉచితంగా నిర్వహించుటకు ముందుకు వచ్చారు వీరిలోని దేశభక్తే వీరి నీ కార్యక్రమానికి ఉద్యుక్తులను జేసింది దీనితో స్కూళ్ళసమస్య ఏర్పడింది. ప్రజలందరకీ విద్యగరపుటకు ఒక్క సం॥రములో తగినన్నిస్కూళ్ళు నిర్మించుట సాధ్యమా? కాని ఈ అడ్డంకుచే విద్యాకార్యక్రమం ఆగరాదు అందుచే పాఠశాలలు పగోడా (బౌద్ధదేవాలయాలు)లలో ప్రారంభించారు. ఉపాధ్యాయులు జట్లకొలదిగా గ్రామములవెంబడి బయలుదేరారు.

మేగా. యువకులు "దేశంలో ఒక్క ఎకరం సేద్యంకాకుండా వుండరాదు, ఒక్కడు ఆహారం లేకుండా చావరాదు." అనేనినాదం తీసుకొన్నారు. యువకులు దళములుగా ఏర్పడి బంజరునంతనూ సాగుచేయప్రారంభించారు. చివరకు పట్టణములలోని ప్రభుత్వ కార్యాలయాలలో గూడా ఒకగజం వృధాగా పోనివ్వలేదు. పంటలు, ఫలవృక్షములు, పెంచ ప్రారంభించారు. పూలతోటలనెల్ల పండ్లతోటల క్రింద మార్చారు.

విద్యార్థులందరిలోను దేశంకొరకు కష్టించి పనిచేయ వలయుననెడి భావం ఏర్పరుడుచున్నది. దీనికి అనేక దళములుగా ఏర్పడ్డారు. తమలో తాము పోటీలు పడి పని జేస్తున్నారు. ఈ యువకదళాలు సాగుజేయు క్షేత్రాలన్నిటికీ జాతీయ వీరుల పేర్లుపెట్టారు. చివరకు చిన్నపిల్లలు సహితం గునపాలు, నీళ్ళగుబ్బలు తీసుకొని పెద్దలతో పోటీకని తయారు. చిన్నపిల్లలు ప్రత్యేకంగా ఒకపార్కును సేద్యం జేస్తున్నారు. ఇదిపిల్లల ప్రత్యేక కృషిక్రింద దేశం గుర్తించుతుంది. వాళ్ళపేరుమీదుగా ఈరోజున ఈపార్కు పిలవబడుతోంది.

యువకులు పొలములలోనికి వెళ్ళి కోత, నూర్పిళ్ళల్లో రైతులకు సాయంజేస్తారు. నూతన వ్యవసాయ పద్ధతులను రైతులకు నేర్పుతారు. ఏరైతన్నాజబ్బుపడి, లేక స్వతంత్ర యుద్ధంలో మరణించియున్నా ఆ సంసారమునకు గ్రామ యువకులందరూ తమ బాధ్యతక్రింద పొలం పనులలోకి వెళ్ళి తోడ్పడుతారు.

వైద్య సహాయం

నిరుటి సంవత్సరం దేశంలో కలరా, మశూచి పొడ సూపినవి. వెంటనే వీటిని వ్యాపించకుండాచూచుటకు యువకులు దళములక్రింద ఏర్పడినారు, గ్రామాలవెంట తిరిగి ఆరోగ్య పద్ధతులను వివరించారు. ప్రజలకు సూదిమందుల నిచ్చారు. పట్టణములలోను, గ్రామములలోను మురికి ప్రదేశములను బాగుపర్చారు. గ్రామంలో ఏవ్యాధి బయలు దేరినా, లేక అంటువ్యాధులతో మరణించినా యువజనసంఘ ఆఫీసులోని గంటమ్రోగుతుంది. గ్రామంలోని యువకులందరూ బయలుదేరి ఆవ్యాధి నిర్మూలనకు కృషిసల్పి ఇతరచోట్లకు ప్రాకకుండా శ్రద్ధతీసుకుంటారు.

ఈ కార్యక్రమ మంతటిద్వారా యువకులను, వారిసంఘాలను ప్రజలెంతో గౌరవించుతారు. ప్రజలకు ఈ విషయములన్నింటినీగూర్చి నచ్చజెప్పుటకు వారి నమ్మకాన్ని మనం చూరగొనాలి. వారిభాషలో, వారికర్థమగునట్లు శాంతంగా తెలియజెప్పాలి. ఈకృషిలేకుండా పడికట్టుపదాలు ప్రయోగించినా, నిరంకుశంగా ప్రభుత్వం ఆజ్ఞలుజారీచేసినా, ఫలితం శూన్యం. ఫ్రెంచి సామ్రాజ్యవాదుల క్రిందనున్న ప్రభుత్వమునకూ హో-చి-మిన్ ప్రజాప్రభుత్వమునకూఉన్న ప్రధాన వ్యత్యాసమిదే. అందుచే ఎంతటి కార్యమునయినా మేం ప్రజల సహకారంతో సునాయాసంగా చేయగలుగుతాము,

దేశరక్షణ - యువకులు

ఒక్కమాటలో చెప్పాలంటే వీట్-నాం సైన్యమంతా యువకులసైన్యమే. సైన్యంలో నూటికి 95మంది 16—25 సంవత్సరముల మధ్యనున్న యువజనసమితి సభ్యులే. కొన్నిరంగాలలో 13—14 సంవత్సరముల బాలురు పోరాటములో పాల్గొనుచున్నారు, పాల్గొనడమేకాదు. పోరాటాలకు నాయకత్వంవహించి నడుపుతున్నారు. హోనైలోనున్న ఫ్రెంచిమందుగుండు సామగ్రిగిడ్డంగులు మొన్న దగ్ధంచేయబడినవి. అది బాలురుజరిపిన వీరోచితచర్య. ఒకరోజు 600 ప్యాస్ (వీట్-నాం నాణెం) కావలయునని ఒక బాలురదళం వచ్చింది. డబ్బు యెందుకంటే, ఫలితం పొందిన తర్వాత




వీట్‌నాం యువకుల ప్రతిఘటనాదృశ్యం.

ఒక గ్రామంలో ప్రజలకు చదువను, వ్రాయనునేర్పగనే మరియొక గ్రామం ఇట్లు ఒక్క సం॥రంలోను 25 లక్షల మందికి చదువు చెప్పగల్గారు. ఫ్రెంచి సామ్రాజ్యవాదము క్రింద బానిసలుగా వున్నప్పుడు మాలో 85 మందికి చదువు రాదు. ఈ సంఖ్య సంవత్సరంలో 20 కి దిగివచ్చింది.

దీనికితోడుగా విద్యార్థులచేత తయారుచేయబడిన 10 చిత్రప్రదర్శనములఇట్లు వివిధ ప్రాంతములకు బయలు దేరినవి. ఈ చిత్రాలు చదువుకోవలసిన ఆవశ్యకతనుండి – సామ్రాజ్యవాదులను ఎట్లా, ఎందుకు ఎదిరించవలయునో అంతవరకూ తెలియజేస్తాయి, ఈ ప్రదర్శనములు మా గ్రామాలలో చాలామందిని ఆకర్షించుచున్నవి వీటి ఫలితంగా 60, 70 సం॥ ముదుసలులు గూడా చదువను వ్రాయను నేర్చుకొనుటకు ముందుకువస్తున్నారు, ప్రాథమికపాఠశాలల లోని పిల్లలుసైతం తమకు చేతనైనట్లు బొమ్మలుగీసి చిత్ర ప్రదర్శనలు ఏర్పరచుచున్నారు. ఈ పద్ధతులవలన 6 సం॥ బాలురనుండి 70 సంవత్సరముల వృద్ధులవరకు ఈరోజుకూ దేశంకొరకు వీరమరణం పొందుటకు ముందుకు వస్తున్నారు మేం నిరక్షరాస్యతను నిర్మూలించిన మరియొక విధంచెబుతాను యువకులనేకమంది అనేక విప్లవగేయాలు వ్రాశారు. యువదళాలు యీపాటలను పాడుకుంటూ దళములుగా గ్రామములవెంట బయల్దేరుతాయి ఈపాటలు ప్రజలను బాగా ఆకర్షించుచున్నవి. వీటిని నేర్చుకొనవలెననే వాంఛ కలుగగనే చదువనూ, వ్రాయనూనేర్పి విప్లవగీతాలు నేర్పుతారు ఈ పాటల దళములద్వారా ఒక్కవిద్య నేర్చుకొనమనిమాత్రమే కాదు ప్రజలలో ప్రబోధించేది, విప్లవ ప్రబోధమునకుగూడా చక్కగా ఉపయోగిస్తాయి

అధికారంలోవున్న ప్రభుత్వం స్వతంత్ర ప్రభుత్వమైనా ప్రజల విశ్వాసమును చూరగొన్న కార్యక్రమం అనుసరించనిది నిరక్షరాస్యతను నిర్మూలించుట సాధ్యంకాదు మా అధ్యక్షుని క్రింద నడుపబడుచున్న ప్రభుత్వం ప్రజలనమ్మకాన్ని చూరగొన్నప్రభుత్వం కనుకనే, మేం ఇంతతక్కువ కాలంలో నిరక్షరాస్యతను నిర్మూలించ గల్గుతున్నాం. ఈ సామ్రాజ్యవాదుల దండయాత్ర లేకపోయిన మరియొక సంవత్సరంలో వీట్-నాం ప్రజారాజ్యములో నిరక్షరాస్యుడనేవాడులేకుండా జేసేవాళ్ళం



హో - చిన్ - మన్

(వీట్ - నామ్ రిపబ్లిక్ అధ్యక్షుడు)

ఆర్థిక పునర్నిర్మాణం

ఇక ఆర్థిక విషయాలకు వద్దాం కరువంటే ఏమిటో భారతదేశ యువకులకు నేను గుర్తుజేయ పనిలేదు. సామ్రాజ్యవాదులు కాలుపెట్టినచోటల్లా యీ కరువు ప్రత్యక్ష

వీరోచిత ప్రతిఘటన

చెబుతామన్నారు. మూడవరోజున విజయగర్వంతో ప్రత్యక్ష మయ్యారు. భూగర్భంలోనుండి మార్గాన్ని ఏర్పరిచారు. గిడ్డంగులపై నున్న కొందరిని కట్టుకొన్నారు పని పూర్తి జేశారు తమ మందుగుండు గిడ్డంగిగతి ఇట్లవుతుందని ఫ్రెంచివాళ్లు కలలోనైనా వూహించలేదు

వీట్-నాం యువకులగూర్చి ఫ్రెంచివాళ్ళు యేమనుకొనునదీ చెపితే, వారిపాత్ర మీకర్ధమవుతుంది "ఈ దేశంలోనున్న ప్రతిగడ్డిపోచా ఒక యువసైనికుడు" అంటారువాళ్ళు. ఎక్కడ జూచినా మాయువకులు ప్రత్యక్షమే. రోడ్లపై ఫ్రెంచి పటాలాలు పోతుంటే, పొదలనుండి మా దళాలు వాండ్లను వెంటాడుతాయి అనువైన కీలకస్థానాల్లో దెబ్బ తీస్తాయి చివరకు నీటిపై ప్రయాణంలోగూడ ఫ్రెంచి వాండ్లకు స్థిరంలేదు యువకులు నూతన పద్ధతులను కని పెట్టారు. కనిపెడుతున్నారుగూడ. నీటిలోమునిగి కూర్చుంటారు. గాలికొరకు ముక్కులనుండి బయటికి వాసంతో తయారుచేసిన గొట్టాలను పెట్టుకొంటారు ఫ్రెంచి సైనికుల నావవెళ్ళుతుందని వునికి తెలియగనే పైకివచ్చి చేతి బాంబు విసరుతారు. ఫ్రెంచివాళ్ళు ఎక్కడవుంటే అక్కడల్లా యువకులు ప్రత్యక్షమే

బాలవీరులు

అసలు మా స్వతంత్ర పోరాటంలోని ప్రధమ సైనికుడు ఒక బాలుడు బ్రిటిష్‌వాళ్ళు వీట్-నాంలో దిగిన రోజున బ్రహ్మాండమయిన ప్రదర్శనమొకటి జరుపబడింది చాటున యుండి ఫ్రెంచి సైనికులు ఆ ప్రదర్శనంపై కాల్చారు, ఇది చూచి సహించలేక ఒక బాలవీరుడు విల్లంబులతోనూ, వాసాలతో తయారుజేసినబాకులతోనూ తనపటాలమును వెంటనే తీసుకొని యీ మురాకు బుద్ధిచెప్పాలని బయలుదేరాడు ఈ వీరుని ఫ్రెంచి పిరికిపందలు చాటునుంచి కాల్చి పారిపోయారు ఆ రోజునుండీ యీ బాలవీరుడు మా జాతీయ వీరుడు బాలురందరూ తమ బాలవీరుని పేరు స్మరించుతూ పోరాడుతారు వీట్-నామ్ సైన్యము శత్రువునకు ఖైదుగా చిక్కటమనే సమస్యయే లేదు పోరాటంలో ఆఖరుగుండు యెల్లప్పుడూ తనకొరకు వీట్-నాం సైనికుడు వుంచుకుంటాడు రంగంనుంచి వెనుకకు తిరుగుట యెరుగడు, ఇతన్నిజూచిన సామ్రాజ్యవాదుల వార్తాసంస్థ 'రాయిటర్సు' ప్రతినిధి "డూం-కీం బెక్" "వీట్-నాం యువకులు నమ్మలేనంత మూఢ విశ్వాసంతోను, పిచ్చితనంగాను పోరాడుచున్నారు"అని చెప్పక తప్పలా.

భారత విద్యార్థుల, యువకుల సానుభూతికి వీట్-నాం దేశమంతా ఎంతో వుప్పొంగిపోయింది మీ అండతో సామ్రాజ్యవాదులను పారద్రోలగలమనెడి దృఢవిశ్వాసం ప్రతి వీట్-నాం పౌరునికీ వుంది. ఈ విశ్వాసంతోనే మీ స్వతంత్రపోరాటమును అతిశ్రద్ధతో వీట్-నాం ప్రజలు గమనిస్తున్నారు వైద్యసహాయంకొరకు వీట్-నాం యువకులు మీవైపు ఎదురుజూస్తున్నారు మా యువకులను మీరు నిరుత్సాహపర్చరని—మా స్వతంత్రపోరాటమునకు యిప్పటికే భారతవిద్యార్థులు జేసిన త్యాగాలనుజూస్తే, మాకు దృఢనమ్మకం ఉంది.

★

(3 వ పేజీ తరువాయి)

మనవిధి

మన 'రాఘవ' అస్తమించి ఒక సంవత్సరం దాటింది ఆయన చనిపోవడం ఆంధ్ర నాటకరంగానికి ఒక తీరనిదెబ్బ అని నటకులేగాదు, ఆంధ్రులందరూ విలపించారు ఆయన కీర్తిని చిరస్మరణీయం చేయడానికి పెద్దలు చాలామంది వాగ్దానాలు చేశారు, నాటకశాలలు నిర్మిస్తామన్నారు శిలావిగ్రహాలు ప్రతిష్ట చేస్తామన్నారు నాట్యకళాశాలలు నడుపుతామన్నారు సంవత్సరం గడిచింది ; వాగ్దానాలు ఆచరణలోకి రాలేదు ఆంధ్ర నాటక కళాపరిషత్తువారు 'రాఘవ' మహల్ అనే పేరుతో బెజవాడలో ఒకపెద్ద థియేటర్‌ను నిర్మిద్దామని రు30,000 పోగుచేసినట్టు వినికిడి భవన నిర్మాణం యింతవరకూ బయట పడలేదు పని తొందరగా సాగించవలసిందిగా మనవి

ఆంధ్ర నాటకరంగాన్ని ఔన్నత్యానికి తీసుకొని వెళ్దామని అహర్నిశలూ చింతిస్తూ ఆంధ్రుల విజ్ఞానాభివృద్ధులకు తోడ్పడదామనే జిజ్ఞాసతో వారు జీవితాన్ని చాలించారు ఈ మహత్తర ఆశయాన్ని పూర్తిచేసేబాధ్యత మనమీద వుంది. అది కళాకారులందరూ గుర్తిస్తారని ఆశిస్తాను

★ ఆశియా జాతులు

కొద్ది రోజులక్రితం ఢిల్లీలో అఖిల ఆసియా దేశాల మహాసభ జరిగింది ఈ మహాసభ చారిత్రాత్మకమైనది. యుద్ధానికిపూర్వపు ఆశియాగాక, ఒకనూతన ఆశియాగా మహాసభలో ప్రదర్శితమైంది. పరపీడనను, దోపిడిని పూర్తిగా రూపుమాపి, సర్వ ప్రజలకు సమానహక్కులనిచ్చి ప్రపంచానికి ఆదర్శప్రాయంగావున్న సోవియట్ రష్యానుండి, విప్లవ ప్రజాసైన్యాలను నిర్మించి డచ్చి - ఫ్రెంచి సామ్రాజ్యవాద సైన్యాలతో హోరాహోరిగా పోరాడుచున్న ఇండోనేషియా, వీట్-నామ్ దేశాలనుండి ప్రతినిధులువచ్చి యీమహాసభలో పాల్గొనటమే మహాసభకు నూతన శోభను, ప్రాముఖ్యతను కల్గించింది. పరాయి ప్రభుత్వాల నిరంకుశత్వానికి, దోపిడీకి గురియై బాధల ననుభవిస్తున్న ఆశియాలోని దేశాల ప్రతినిధులందరూ ఒకచోట సమావేశమై చర్చలు సాగించుట వలన భవిష్యత్ ఐక్య ఆశియా వుద్యమానికి ప్రధమ సోపానము వేశారని చెప్పవచ్చు ఈ సభకు ఎడమర ఇరాన్ ఇరాక్ మొదలు తూర్పున ఇండోనీషియావరకు, ఉత్తరం సోవియట్‌రష్యా మొదలు దక్షిణం సిలోను వరకుగల భూభాగంలోని 32 దేశాలనుండి 250 మంది ప్రతినిధులు వచ్చారు

ఎంతోకాలంనుండి ఆశియాదేశాలు పరదాస్యాన్ని అనుభవిస్తున్నవి స్వాతంత్ర్యాన్ని కోల్పోయిన ఈదేశాలన్నీ సామ్రాజ్యవాదుల నిరంతర దోపిడీలకు, నిరంకుశపాలనకు గురౌతున్నాయి ఒకప్పుడు స్వాతంత్ర్యాన్ననుభవించి ఇతర దేశాలకు సయితం విజ్ఞానవికాసాలు వెదజల్లిన ఆశియా, ఈ రోజున కొద్దిమంది పాశ్చాత్యుల పాలనకు బానిసైపోయింది ఈదేశాల సిరిసంపదలు పూర్తిగా దోచుకోబడినవి. ఆశియాకేగాక ఇతర దేశాలకుకూడా సరిపోయే ఆహారధాన్యాలను పండించగలిగిన సారవంతమైన భూములున్నప్పటికీ పరిశ్రమాభివృద్ధికి ఎంతో తోడ్పడే చక్కని నిధులు, గనులు వున్నప్పటికీ, పరపాలనవలన యీ దేశాల ప్రజలు కనీసం కడుపునిండా తిండి, వంటినిండా బట్టలేక నిత్యదారిద్ర్యము అనుభవిస్తున్నారు పాశ్చాత్యులు మన విజ్ఞాన వికాసాభివృద్ధిని పూర్తిగా అరికట్టి, వారి విజ్ఞానవికాసాల అభివృద్ధితో, ఆధునికయంత్రాలతో, పశుబలంతో మనలను పరిపాలిస్తున్నారు. ఆశియాదేశాలను పాలించే ఈ క్రింది దేశాల జనసంఖ్యను గమనిస్తే ఎన్ని లక్షలమంది విదేశీయులు, ఎన్ని కోట్లమంది ఆశియావాసులను పీడించుతున్నారో బోధపడుతుంది—

పాలించేదేశాల జనసంఖ్య	పాలితదేశాల జనసంఖ్య	
హాలెండ్ 80 లక్షలు	— ఇండోనీషియా	6 కోట్లు
ఫ్రాన్సు 4 కో 20 ల	— ఇండోచైనా	1 కో 90 ల.
ఇంగ్లండు 5 కోట్లు	— ఇండియా	40 కోట్లు
	— బర్మా	1 కో 60 ల.
	— సిలోన్	60 లక్షలు
	— మలయా	15 లక్షలు

ఇండియా, బర్మా సిలోన్, మలయాలలో బ్రిటిష్— ఇండోనేషియాలో డచ్చి — ఇండోచైనాలో ఫ్రెంచి, సామ్రాజ్యవాదుల పాలన. చైనాలో అమెరికా నిరంకుశత్వం - ఒక్కమాటలో చెప్పాలంటే ప్రపంచ జనాభాలోనే సగభాగంగా వున్న ఆశియాపై కొద్దిమంది పాశ్చాత్య దోపిడిగాండ్రు పెత్తనం చలాయిస్తున్నారు.

కాని ఈనాడు ఆశియా సామ్రాజ్యవాదులు ఆశించినట్లుగా లేదు. యుద్ధానికిపూర్వపు ఆశియాకు, యుద్ధానంతర ఆశియాకు చాల వ్యత్యాసం వుంది యుద్ధం వున్నంతకాలం అతి నికృష్టజీవితాన్ని గడిపి, ఎన్నో త్యాగాలుజేసి జపాను ఫాసిస్టుల నోడించిన ప్రజలు పరపీడనకు తలయొగ్గదలచలేదు. సామ్రాజ్యవాదుల పెత్తనానికి స్వస్తిజెప్పదల్చారు సంపూర్ణ స్వాతంత్ర్యమే లక్ష్యంగా బెట్టుకొని ముందుకు సాగిపోతున్నారు. అన్నిదేశాలలోను స్వాతంత్ర్య ఉద్యమాలు ఉరకలెత్తుకుంటూ పొంగివస్తూవున్నవి. చైనాలో అమెరికా సైన్యాలపై, ఇండోచైనాలో ఫ్రెంచి సామ్రాజ్యవాదులపై, ఇండోనీషియాలో డచ్చి ప్రభుత్వంతోను ప్రత్యక్షమైన

రచన:
వీరమాచనేని మధుసూదనరావు

పురోగమనం



శ్రీమతి సరోజినీ నాయుడు
ఆశియా జాతుల మహాసభ అధ్యక్షురాలు

సాయుధపోరాటాలు జరుగుతూవున్నవి బర్మా, ఇండియా మొదలగు తదితరదేశాలలో ఏ రంగంలో చూచినా సమ్మెలు, ప్రదర్శనాలు, కాల్పులు సాగుతూవున్నవి నేడు ఆశియా అంతా ఒక అగ్నిపర్వతంలాగ వుంది

ఒకప్రక్కన సామ్రాజ్యవాదుల దోపిడీకి, బానిసత్వానికి గురవుతున్న ఆశియాదేశాలలో పరిస్థితులు ఇంతవిషమ రూపం దాల్చుతూ, పరిపక్వమైన విప్లవపరిస్థితి కనబడుతూన్నప్పుడు మహాసభ వారికి చూపవలసిన కర్తవ్యమేమిటి? ఈ ప్రజావుద్యమాలన్నిటినీ సమన్వయపరచి, ఆశియానుండి సామ్రాజ్యవాదులను పారదోలుటకు, సంఘటితమైన ఆశియా వ్యాపిత విప్లవోద్యమాన్ని నడపటానికి ప్రయత్నించాలి కాని మహాసభలో ఈవిధమైన ప్రయత్నమేమీ జరగలేదు పైగా మహాసభను రాజకీయ ప్రాముఖ్యత లేకుండా కేవలము వైజ్ఞానిక మహాసభగానే ప్రకటించారు ఇండొనీషియా, వీట్-నామ్, చైనా, బర్మా మొదలగు దేశాలలో దారుణహింసాకాండను అమలుపరుస్తున్న డచ్చి ఫ్రెంచి, అమెరికా, బ్రిటిష్ సామ్రాజ్యవాదుల చర్యలను ఖండించనైనాలేదు మహాసభలో ప్రయత్నించినట్లు ఆశియా దేశాలమధ్య చక్కని ఆర్థిక, సాంఘిక, వైజ్ఞానిక సంబంధాలను అభివృద్ధిచేయటం అవసరమైన విషయమే కాని దీనికున్న అవకాశాలు, ఆడ్డంకులు విషయంగనుక ఆలోచిస్తే మహాసభ వీటినిగురించి గూడా తీవ్రముగా ఆలోచించలేకపోయిందనే చెప్పాలి. ఎందువల్లనంటే-యిప్పుడు సామ్రాజ్యవాదులకు బానిసలుగా మ్రగ్గుతున్న యీ ఆశియాప్రజలమధ్య ఆర్థిక, సాంఘిక, వైజ్ఞానిక సంబంధాలు పూర్తిగా అభివృద్ధి చెందాలంటే, సామ్రాజ్యవాదుల పెత్తనం యీ దేశాలపైనున్నంతకాలం అసాధ్యం. సామ్రాజ్యవాదాన్ని ఆశియా ఖండంలో నిర్మూలించే యిట్టి సన్నిహిత సంబంధములను నెలకొల్పగలం. ఈవిషయాన్నిగూర్చి మహాసభఏమాత్రమూ హెచ్చరించలేదు.

అంతేగాక, యింతటి దారుణ హింసాకాండను సాగించి స్వాతంత్ర్యోద్యమాలనురక్తంలోముంచెత్తుతున్న సామ్రాజ్యవాదులపై తమకున్న భ్రమలను వెల్లడిజేసింది సామ్రాజ్యవాదులు తమంతటామే అధికారం ఆశియావాసులకు అప్పగించి వైదొలగుతారనే దృక్పథతో గూడిన రాజకీయ తీర్మానం జేశారంటే, రాజకీయంగా మహాసభ విఫలమైందనే చెప్పక తప్పదు. తమ పలుకుబడిని, అధికారాన్ని, నిలబెట్టుకోవడం కోసం సామ్రాజ్యవాదులు వేస్తున్న ఎత్తులు, అమలు జరుపుతున్న పైశాచికత్వం జూస్తున్నవారెవ్వరూ దీన్నినమ్మలేరు. ఇకముందన్నా మహాసభ యిట్టి వైఖరిని సవరించుకొని, విప్లవోద్యమాలకు నాయకత్వం వహించి, ఆశియా వ్యాపితంగా సామ్రాజ్యవాద వ్యతిరేక విప్లవ పోరాటాన్ని సాగించుతుందని ఆశించుదాం

☆

పాఠకులకు విజ్ఞప్తి

'నవయుగ' రెండవ సంచికను మీకు సమర్పిస్తున్నాం. మాశక్తికొలది పత్రిక అభివృద్ధికి కృషిసల్పుతున్నాం. దానికి మీతోడ్పాటుగూడ ఎంతో అవసరం కనుక ప్రతిసంచికను చదవగానే పత్రికలోని శీర్షికలగురించి, వ్యాసాలగురించి అభిప్రాయాలను తెలియజేయండి. ఎట్టిశీర్షికలు ప్రారంభించాలో సూచనలీయండి. ఇది పత్రిక అభివృద్ధికి ఎంతో తోడ్పడుతుంది.

– సంపాదకుడు.

వీరగాధలు-2

"పులిబిడ్డ"

రచన:
శ్రీమతి కల్పనాదత్తు

[చిట్టగాంగ్ విప్లవ సమరంలో ముందు నిలబడి స్వాతంత్ర్యాశయంకొఱకు త్యాగబుద్ధితో ఆత్మార్పణం గావించిన - పద్దాలుగేండ్ల బాలవీరుడు - "టేగ్రా" - అమర స్మృతి.]

1930 ఏప్రిల్ 22 వ తేదీన, చిట్టగాంగ్‌సమీపంలో ఉన్న 'జలాలాబాద్' కొండమీద మొదటిసారిగా విప్లవకారులు బ్రిటిష్ దళాలతో తలపడ్డారు. ఆయుద్ధభూమిలో ఆహుతిఅయిన తొలిప్రాణం ముక్కుపచ్చలారని పద్దాలుగేండ్లపసి 'టేగ్రా'.

మొట్టమొదట, యుద్ధప్రయత్నాల సందర్భంలో టేగ్రా పేరు పూర్తిగా విడిచిపెట్టేశారు. కారణం, అతను మరీ పసికుర్రవాడు కావడమే వాళ్ల అన్నదమ్ములు ముగ్గుర్లోకీ 'టేగ్రా'యే కడపటివాడు. అందర్లోకీ పెద్దఅతను సంసారం దిద్దుకుంటూండేవాడు. రెండోవాడయిన లోకనాధ్‌బల్, టేగ్రా యిద్దరూకలిసి విప్లవంలో పాల్గొన్నారు. కొడుకులు ముగ్గుర్లోనూ, తల్లికి లోకనాధ్‌అన్నా, టేగ్రాఅన్నా ఎక్కువ ప్రాణంగా ఉండేది. వాళ్ళ విప్లవకృత్యాలు చూసి ఆ మాతృహృదయం గర్వించేది. విప్లవ నాయకుడైన సూర్యసేన్‌ను కూడా ఆమె - "కుర్రవాళ్ళనిద్దరనీ తీసికెళ్ళకు నాయనా! టేగ్రాను నాదగ్గరే ఉండనివ్వు" అని కోరింది మాస్టర్‌దా (సూర్యసేన్) కూడా అందుక్కంగీకరించాడు తల్లితో బాటు యింటిదగ్గరనే ఉండి, యుద్ధానంతరం విప్లవశక్తుల్ని పునర్వ్యవస్థీకరించవలసిన బాధ్యత టేగ్రా మీద ఉంది అందువల్లనే, యుద్ధసన్నాహాలలో - టేగ్రా పేరు చేర్చబడలేదు

1930 ఏప్రెలు 18 వ తేదీ మిట్టమధ్యాహ్నం. టేగ్రా తోటిస్నేహితులతో కలిసి, చెరువులో ఈతలు మొదలెట్టాడు. ఒకళ్ళమీద ఒకళ్ళు నీళ్ళు చల్లుకోవడంతో, పందాలతో గంటలు దొర్లిపోయాయి. ఆ ఉత్సాహంలో వారు కాలమే మర్చిపొయ్యారు. ఎలాగైతేనేం. మూడు గంటలకు అందరూ ఒడ్డెక్కారు. టేగ్రా బిక్కమొహం వేసుకొని మెల్లగా యింటికి జేరుకున్నాడు ఇంటికి రాగానే తల్లి కోపంపట్టలేక, నాలుగుతిట్టి, చెవులు మెలేసింది; దానితో టేగ్రా అలిగి ఆరోజల్లా అన్నంతినలేదు. "అమ్మెందుకు తిట్టాలి నన్ను? అంతసేపూ నీళ్ళలో నానింది తన్నులు తినడానికేనా?" అనుకున్నాడు.

టేగ్రా ఆ రోజంతా చిఱచిఱలాడుతూనే ఉన్నాడు కాని ఇంతలోనే, విప్లవకారుల్లో ఏదో కొత్త ఉద్వేగం బయలుదేరడం పసికట్టాడు వాళ్ళ అన్న లోకనాధ్‌కూడా విప్లవ నాయకులలో ఒకడు. ఆవేళ సాయంకాలం ఏదో ఒక కొత్త సంఘటన జరిగే సూచనలు కనిపిస్తున్నాయి. చాల మెలకువతో సన్నాహాలు జరిగిపోతున్నాయి ఇహ, టేగ్రా ఒక్కనిమిషంకూడా మొహం ముడుచుకొని కూచోలేకపోయాడు. అన్నవెంబడి, 'కాంగ్రెస్ భవనాని'కి వెళ్ళాడు. అక్కడ మాష్టరుదా విప్లవకారులకు సమరసందేశం వినిపిస్తున్నాడు. అదంతా అయి, వాళ్ళు టేగ్రాను చూసేటప్పటికి చాలా ఆలస్యమైంది. అప్పుడా కుఱ్ఱవాణ్ణి యింటికితిప్పి పంపడానిక్కూడా వ్యవధిలేదు . టేగ్రాకూడా వాళ్ళల్లో కలిసిపోయాడు. ఆయుధాగారాన్ని దోపిడీచేసి పట్టుకొన్న ఆయుధాలను ఏరి, అందరికీ పంచి యివ్వడం అతని ఉద్యోగం.

విప్లవకారుల అసలు వ్యూహం . మొదట చిట్టగాంగ్ ఆయుధాగారంమీద దాడిచెయ్యడమూ, తరువాత పోలీసు దళాలను విచ్ఛిన్నంచెయ్యడమూను, ఆమీదట జిల్లాలోకి మిలిటరీ బలాలు రాకుండా దిగ్బంధం కావించడమూ ఈ వ్యూహానుసారం, వాళ్ళు చిట్టగాంగ్‌ను పట్టుకొని- వారం రోజులవరకూ స్వతంత్రంగా కాపాడగలరు. కాని, వారం రోజులైన తర్వాత. అదనపు సాయుధబ్రిటిష్‌దళాల రాకతో విప్లవకారులందరూ వీరోచితంగా పోరాడి. వీరస్వర్గం పొందడం ఒక్కటే మార్గాంతరం.

కాని, దురదృష్టవశాత్తూ, ఆయుధాగారంమీద దాడి జరిగిన మరునాడే, వాళ్ళు యుద్ధంలో తలపడవలసి వచ్చింది. టేగ్రాకూడా వాళ్ళతోనే ఉన్నాడు. కూడూ, నీళ్ళూ లేకుండా అందరూ రాళ్ళురప్పల్లోపడి కొండలెక్కి పోవాలి. కాని, తామొక మహత్కార్య సాధన కోసం పురోగమిస్తున్నామన్న దివ్యోత్తేజం వారిలో పొంగులెత్తింది. ఆకలి దప్పులు అదృశ్యమైనాయి. పగలల్లా, నిప్పులు చెరిగే ఎండలో ఏ

రాయచాటునో, ఏ పొదల మాటునో పండుకొని, దాక్కోవాలి. అర్ధరాత్రివేళ లేచి, ఆకలిదప్పుల్ని అణచిపెట్టుకొని, అరికాళ్ళు బొబ్బలెక్కి మండిపోతున్నా - నడిచిపోవాలి. ఇలా సాగింది వాళ్ళ జైత్రయాత్ర.

ఏప్రిలు 22 వ తేదీ. అప్పటి కప్పుడే నాలుగురోజులు గడిచిపోయాయి. ఎలాగో తిప్పలుపడి. అంబికా చక్రవర్తి పచ్చి పుచ్చకాయలు రెండు సంపాదించ గలిగాడు మొత్తం రెండుకాయల్నీ కలిపి అరవై ముక్కలుగా కోశారు ఉన్న వ్యక్తులసంఖ్య ఏభై ఎనిమిది. ఒక్కొక్కరూ ఒక్కొక్క ముక్క తీసుకోవాలని అంబికా ఆజ్ఞ

పుచ్చకాయ ముక్క ఒక్కటి తిన్నంత మాత్రాన ఆకలి గానీ, దప్పికగానీ తీరుతుందా ? పైపెచ్చు – దాహంజాస్తి అవుతుంది అయినా, అంబిక ఆదేశానుసారం, ఒక్కొక్కరూ ఒక్కొక్క ముక్క తీసుకున్నారు. కాని, తీరా చూసేసరికి చివరకు మిగలవలసిన రెండు ముక్కలుకూడా మాయమైనాయి.



చిటగాంగ్ విప్లవవీరుడు టేగ్రా

ఇలాంటి విషయాల్లో అంబిక చాలా కఠినంగా ఉంటాడని ప్రతివాడికీ తెలుసు. విప్లవకారుల నైతిక ప్రవర్తనకుగాని, క్రమశిక్షణకుగాని ఏమాత్రం భంగపాటు గల్గినా, ఆయన సహించడు వెంటనే అందర్నీ పిలిచి మిగిలిపోయిన ఆరెండు ముక్కలు ఎవరుతీశారో చెప్పమని నిలవదీశాడు. టేగ్రా ధైర్యంగా ముందుకు వచ్చి, తొణుకూ - బెణుకూ లేకుండా "నా కాకలి మండుకుపోతోంది. అందుకని నేనేతీశాను—" అని చెప్పేశాడు. చేసినపని తప్పని తెలుసుకోగానే టేగ్రా ఏశిక్షయినా అనుభవించడానికి సిద్ధపడ్డాడు అంబిక అతన్ని రెండు లెంపకాయలు కొట్టి పంపించివేశాడు. తక్కిన వాళ్ళంతా 'అమ్మయ్య' అనుకొని ఎవరి పనుల్లోవాళ్ళు నిమగ్నులయ్యారు.

ఇంకా ఎంతోసేపు కాలేదు. ఒక్కసారిగా తుపాకులు మ్రోగినై ఆనల్లని చీకటిముసుగులో, విప్లవకారులందరూ జలాలాబాద్ కొండను అధిరోహించడానికి అంతిమ సన్నాహాలు చేశారు. ఇంతలోనే హఠాత్తుగా ఎదుటి కొండమీద నుండి బ్రిటిష్‌దళాలు కాల్పులు ప్రారంభించాయి. తాము కూడాతిరిగి కాల్పులు సాగించడానికి విప్లవకారులంతా బార్లు తీరి నిలబడ్డారు .. అంతే టప్ ! ... ఎదుటి కొండ మీదినుంచి దూసుకొచ్చే తుపాకిదెబ్బకు టేగ్రానేలకొరిగాడు కాల్పులు సాగించడానికి అనుమతి వచ్చేలోగా విప్లవకారుల మొదటిశ్రేణి కాస్తా ఆహుతైపోయింది.

ఐనా, టేగ్రా యుద్ధంలో పాల్గొనకుండా ఉండలేదు. గుండెల్లోనుండి తుపాకి దూసుకుపోయినా లెక్కచేయక, అలాగే పండుకొని కాల్పులు సాగించాడు. యుద్ధం అయిపోయేవరకు దీక్షతో పోరాడాడు. ఇహనప్పుడు పట్టుబడకుండా ఉండటానికి తిరోగమనం సాగించవలసిన సమయం వచ్చింది. కాని ఏకధారగా రక్తం కారిపోవడంవల్ల టేగ్రా చాలా నీరసించిపోయాడు ఎలుగారిపోయాడు. ప్రక్కనున్న అన్నను "కాసిని మంచినీళ్ళు దాదా" అనిఅడిగాడు. కాని "దౌర్బల్యం విప్లవకారుని లక్షణం కాదు —" అన్న ప్రత్యుత్తరం కఠోరంగా ధ్వనించింది ... టేగ్రా మళ్ళీ మాట్లాడలేదు... అంతే.... తెల్లవారేసరికి జలాలాబాద్ కొండమీద పదకొండు మృతకళేబరాలు కనిపించినై అందులో టేగ్రా ఒకడు....

• • •

స్థానిక మునిసిపల్ హైస్కూలులో టేగ్రా తొమ్మిదవ తరగతి చదువుతుండేవాడు అతను చిన్నప్పటినుంచి చాల తలబిరుసుగానూ, మొండిగానూ ఉండటంవల్ల అందరూ అతనిని "టైగర్" (పులిబిడ్డ) అని ఎగతాళిగా పిలిచేవారు. కాని, అతని కొంటెతనాన్నిచూసి మురిపంతో టైగర్ అనే పేరును టేగ్రా అని ముద్దుపేరుగా మార్చారు.

టేగ్రా మంచి కండపుష్టి గల కుర్రవాడు. చూపరికూడాను. 1927-28 లో విప్లవకారులు చిట్టగాంగ్‌లో 'తాలింఖానాలు' ప్రారంభించినపుడు - టేగ్రా, తన అన్నలతో సహా వాటిల్లో చేరాడు. వాళ్ళతోబాటు, విప్లవ ప్రతిజ్ఞకూడా తీసుకున్నాడు కత్తిసాము, బల్లెపుగరిడీ, మల్లయుద్ధం, గుర్రపు స్వారీ మొదలైనవాటిల్లో మంచి ప్రావీణ్యం సంపాదించాడు.

టేగ్రా మరణవార్తవిని తల్లి గ్రుడ్ల నీరు గ్రుడ్ల కుక్కుకుంటూ - "నేనారోజున తిట్టకుండా ఉంటే, నా చిట్టితండ్రి కీగతిపట్టేదికాదు గదా !" అని వాపోయింది. ఇరుగుపొరుగు వాళ్ళుకూడా యీ వార్తవిని దుఃఖించారు. సింహకిశోరం లాంటి ఆ యువకవీరుడంటే అందరికీ అంత ఆప్యాయంగా ఉండేది !

బాల బాలికలకు

"చిటపట - చిటపట"

— తెన్నేటి సూరి

చిటపట, చిటపట
చినుకులు పడితే
పసిరిక పడుతుంది—
కన్నుల వెంటా
కరుణ ఒలికితే,
జగతి పెరుగుతుందీ—

చిటపట చిటపట
చిటపట చిటపట

రెక్కలువిరుచుకు దుక్కులుచున్నే
రైతును చూచావా?—
పాఠాలన్నీ బాగాచదువుకు
బళ్ళోకొస్తావా?—

బాగా చదువుకు
నాన్నకి మళ్ళే
పనిలో కెళ్లాలోయ్!—
పప్పూ ఉప్పూ
తెచ్చా నంటూ
బామ్మని పిలవాలోయ్!— ॥చిట॥

బీదా బిక్కీ
మన వాళ్లేనని
వాదం చెయ్యాలోయ్!—
బేధం కట్టీ
బాధలు పెట్టీ
గాథలు పోవాలోయ్! .. ॥చిట॥

పడికలవిసిరీ పిట్టలతోలే
కాపును చూచావా!—
పరాయిరాజును పారదోలగా
బరిలోకొస్తావా?— ॥చిట॥

భారత దేశం
నాదే నంటూ
పాటలు పాడావా?—
భారత దేశపు
వీర కుమారుల
తీరులు నేర్చావా? ॥చిట॥

కుప్పలుగొట్టీ గోతాలెత్తే
గొప్పలు చూచావా?
స్వతంత్రభారత సమరావనిలో
విజయం తెస్తావా ॥చిట॥

మనవి

బ్లాకులు సకాలంలో అందకపోవుటచే యీసంచిక ప్రకటన ఆలస్యమయింది ఇందుకు పాఠకులు మన్నించుతారని తలంచుతాను, ప్రతినెలా ఇకనుంచి 20 వ తేదీకి పత్రిక వెలువడుతుంది. ఏజెన్సీలన్నీ 20 వ తారీఖునకే డబ్బుపంపి తర్వాత సంచిక కాపీలను ఆర్డరు జేయాలి.

— మేనేజరు.

కృతజ్ఞత

'నవయుగ' టైటిల్‌బ్లాకు శ్రీ మాధవపెద్ది గోపాలకృష్ణ గోఖలేగారు అడుగగనే వ్రాసియిచ్చినారు. వారికి మా కృతజ్ఞతాభివందనములు. ఈవిషయం ప్రథమ సంచికలో ప్రకటింపలేనందుకు విచారించుచున్నాం.

— సంపాదకుడు.

విద్యార్థి సోదరీ సోదరులారా!

స్కూళ్ళు, కళాశాలలు వేసవి శలవలకు మూసేస్తున్నారు. ప్రతి విద్యాలయమునుండి విద్యార్థులు పల్లెలకు చేరుతున్నారు సంవత్సరమంతా విద్యార్థి కార్యకలాపాలలో మునిగితేలాం ఈ రెండు నెలలూ విశ్రాంతి తీసుకుందామని మీరెవరన్నా ఆలోచించుచున్నారా? నిరంతరం పోలీసు నిర్బంధ విధానం గ్రామాలలో మన తల్లిదండ్రులపై సాగుచున్నప్పుడు, మరియొకపక్క ఉపాధ్యాయులు సమ్మెకు తయారగుచున్నప్పుడు, విద్యార్థులపైన నిరంకుశ చట్టాలు రుద్దబడుచున్నప్పుడు, పాఠశాలల్లో మనవిద్యావిధానం రోజురోజుకూ పతనమగుచున్నప్పుడు మనకు విశ్రాంతి ఎట్లు ఉంటుంది? మనకు శలవలు వచ్చేసరికి నూతన సమస్యలు ప్రత్యక్షమయాయి. ఈ సమయాన రెండు నెలలకాలం విద్యార్థులకు తీరుబడిగాఉండుట ఎలా జరుగుతుంది? అందుచే మన సమస్యలను పరిష్కరించుకొనుటకు మనం విద్యాలయములలోవుండి జరిపిన ఆందోళనను మరిపించే విధంగా స్వతంత్ర సైన్యంలా కలసి ముందుకు నడవాలి. అప్పుడే యీ సమస్యలను మనం పరిష్కరించుకోగల్గుతాం లేనిచో యింతకంటే తీవ్రమైన సమస్యలు మరల మనవిద్యాలయాలు తెరిచేసరికి ప్రత్యక్షమవుతాయి అందుచే నేడు మన ముందున్న సమస్య లేమిటి?

దుర్భర జీవితం

ఈ పదినెలలపాటు గ్రామజీవితంతో సంబంధంలేకుండా పట్టణాలలో గడిపివచ్చిన మనకు ఇంటికిచేరగానే కనిపించే దేమిటి? రైతుల, కూలీల జీవితాలు దుర్భరంగాఉన్నాయి. పండించిన రైతుకే తిండి లేకుండాపోతోంది. కొన్ని కొన్ని ప్రాంతాలలో రేషనుకొట్లలోసైతం బియ్యంలేక ప్రజలు అల్లాడుతున్నారు దొంగమార్కెట్‌లో బియ్యం బస్తా వందరూపాయల్లవరకు అమ్మబడుతూవుంది. దీనితో పాటు నిత్యజీవితావసర వస్తువులైన కొబ్బరినూనె, అగ్గిపెట్టెలు, పంచదార, బట్టలు దొరకడంలేదు. నిర్భాగ్యులయిన కొంతమంది బియ్యంలేక బిడ్డలను చంపుకోవడం, కొబ్బరినూనెలేక జుట్టు గొరిగించుకోవడం వరకు పరిస్థితులు విషమించినవి. ఇంతేగాక, గ్రామాలలో యేర్పడిన ఆహార కమిటీలు స్వార్థపరుల పెత్తనాలతోను, పార్టీకక్షలతోను, నిండి, సరియైన ధరలకు ధాన్యసేకరణగాని, వస్తువుల సక్రమ పంపకంగాని జరుపుచుండుటలేదు. రైతులకు కావలసిన వ్యవసాయపు వస్తువులుగాని, జీవితావసర వస్తువులు గాని యేమి ... లభించుటలేదు. గోరుచుట్టుపై రోకటిపోటన్నట్లు, వీటన్నిటికితోడు జమీందారీప్రాంతాలలో గ్రామకంఠాలు, గ్రామచెరువులు, బంజరులు, సాముదాయక భూములను. రైతులనోట్లో దుమ్ముకొట్టి జమీందార్లుకాజేయాలని పోలీసుల సాయంతో మన తల్లిదండ్రులపైన లారీఛార్జీలు, అరెస్టులు పైగా కాల్పులుకూడ సాగిస్తున్నారు. వీటన్నిటిని యేమాత్రం లెఖ్ఖచేయక రైతాంగం, ఐక్యతగా ముందుకు సాగుతూంది. దీన్ని మనంచూస్తూ ఊరుకుందామా? మనం జరిపిన పోరాటాలలో మన రైతు పెద్దలు పూర్తిగా తోడ్పడ్డారు. లారీఛార్జీలు జరుగుతోంటే వీరుకూడ స్కూలుగేట్ల (చల్లపల్లి, గన్నవరం) వద్ద పికెటింగు జరిపారు జమీందారీలను రద్దుపరుచుటకోసం, జీవితావసరవస్తువుల ధరల కంట్రోలుకోసం, సక్రమపంపకం కోసం, పోలీసు నిరంకుశత్వాన్ని అరికట్టుటకోసం వీరు సాగిస్తున్న పోరాటాలకు అండగా నిలబడండి! గ్రామగ్రామమున సభలు జరిపి బ్రహ్మాండమైన ఆందోళన జరిపి పోలీసు నిరంకుశత్వానికి స్వస్తిచెప్పండి!!

వేసవిశలవులు

విద్యాసమస్యలు

ఇంతేకాదు. ఇకమన విద్యా సమస్యలకు వద్దాం. "శలవులు కదా! యింకేం విద్యా సమస్యలు" అని అనుకోవద్దు. మనకు కొత్తచిక్కు సమస్యలను శలవలలోనే కలిగించటం నిరంకుశాధికారుల లక్షణం. ఎందుచేత? విద్యార్థిలోకం నిర్మాణయుతంగా లేక, చీలిపోయి ఉంటుందిగనక శలవలని తమవిద్యార్థి వ్యతిరేకచర్యలను యెదిరించలేరనేధీమా. క్రిందటి సంవత్సరం యెన్నో విద్యార్థి పోరాటములను నడిపి నెగ్గిన ఆంధ్ర విద్యార్థి ఊరకుండగలడా?

విశ్వవిద్యాలయ విద్యార్థుల సమస్యలను చూద్దాం మన విశ్వవిద్యాలయంలో ప్రజాస్వామికత్వానికి తావులేదని, నిరంకుశాధికారుల నిలయమని, మనకు తెలుసు వీరికి విద్యార్థుల బాగోగులు పట్టవు. అందుచేత నూతనంగా కళాశాలల్లో జీతములను హెచ్చించుటకు కుట్రలు పన్నుచున్నారు. ఈ సమస్యసహితం సెనేట్ సమావేశంలో చర్చించి అంగీకరించబడింది. వీరిప్లాను ప్రకారం యీ క్రింద విధంగా జీతాలను పెంచాలని.

హాజరు తక్కువైనందుకు వసూలుచేయు రుసుం — 5రూ॥ నుండి 25 రూపాయల వరకు.

2. పబ్లిక్ పరీక్షరుసుము:— రు॥ 60నుండి రు॥ 90 వరకు. (ఆనర్సు క్లాసులకు)

3. ప్రవేశరుసుము:— రు॥ 1 నుండి రు॥ 5 వరకు

ఇవిగాక 'టరమ్'కు రు॥ 10 చొప్పున స్కూలుజీతము పెంచవలయునని. ఈ జీతము పెంపుదల ఎందుకవసరమైనదో తెలుసునా? క్రితం సంవత్సరం మద్రాసు ప్రభుత్వం యూనివర్సిటీ ఉద్యోగుల జీతముల పెంపుదలకని 1½లక్షలు గ్రాంటుయిచ్చింది. దీనితో సి. ఆర్. రెడ్డిగారు తన అనుయాయులకుమాత్రం జీతాలుపెంచి తక్కినవారినోట్లో దుమ్ముకొట్టారు 500 రూపాయలకు పైబడి నెలసరిజీతం తీసుకునేవారికిమాత్రం 150, 200 రూపాయలు పెంచడం జరిగిందికాని, క్రిందిఉద్యోగులకు పెంచలేదు. ఈ విషయాన్ని చిన్నఉద్యోగులందరూ మదరాసు ప్రభుత్వమునకు ఫిర్యాదుచేయగా యీ అవకతవకలను సరిదిద్దుటకు బదులు, మొత్తం గ్రాంటునే రద్దుచేయుట జరిగింది. రెడ్డిగారిబృందం తమ అనుయాయులకు పెద్దమొత్తములు ఇచ్చుటకై పైన చెప్పబడినట్లు మనజీతాలు పెంచనిర్ణయించారు ఈచర్యను మనందిగమ్రింగి సహించి ఊరుకుంటామా? విద్యార్థికి ఏ అనువైన వసతులు లేకపోయినా, విద్యార్థిచే హెచ్చుఖర్చులు చేయించుటలో మనవిద్యాలయం భారత దేశములోఉన్న విశ్వవిద్యాలయములలో మూడవస్థాన మాక్రమించుతున్నది. నిపుణతతో చదువుచెప్పటలో మాత్రం మనది చివరిస్థానం. సెనేట్ యొక్క ఈచర్యను మనంతీవ్రంగా ప్రతిఘటించాలి. ఇప్పటికే విశ్వవిద్యాలయపు చదువుకు తగిన ఆర్థిక పరిస్థితులు లేక విద్యార్థులు నానాయిక్కట్లు పడుతూంటే యీ జీతాల పెంపుదలతో వందలకొలది కళాశాలా విద్యార్థులను బైటికి నెట్టుతోంది. విశ్వవిద్యాలయంలోని విద్య ధనికుల

విద్యార్థుల కర్తవ్యం

సొత్తుగా అట్టిపెట్టుటకే ఈ నిబంధన తోడ్పడుతుంది. నేటివరకూ ప్రయాసలకోర్చి విశ్వవిద్యాలయమునకు వెళ్ళుచున్న మధ్యతరగతి విద్యార్థులకు ఇది తీరనిదెబ్బ విద్యార్థిలోకం దీనిని ఐక్యతతో ప్రతిఘటించి జీతముల పెంపుదలను అరికట్టాలి.

ఇట్లే హైస్కూళ్ళయందుకూడ విద్యార్థుల జీతములు 8 నెలలనుంచి 9 నెలలకు కట్టవలయుననీ, 9 నెలల నుంచి 10 నెలల వరకుకూడ కట్టవలయుననీ, కొన్నిజిల్లాలలో అధికారులు ఆర్డర్లు జారీచేస్తున్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలో 9 నెలల జీతం కట్టవలయునని డిస్ట్రిక్టుబోర్డు స్కూళ్ళకు ఆర్డర్లువచ్చినట్లు తెలుస్తోంది. దీనినికూడా విద్యార్థులు ఐక్యతగా నిలబడి యెదిరించాలి.

సీట్ల సమస్య : విద్యావసతులులేని విద్యాలయాలు

ఈసమస్య నేడు ప్రతివిద్యార్థినీ, తల్లిదండ్రులనూ బాధించుచున్నది. ఇంటర్మీడియట్, స్కూల్ ఫైనలు పూర్తిచేసుకుని యేదో ఒక టెక్నికల్ కోర్సుకి వెళ్ళాలని ప్రతి విద్యార్థీ కలలు కంటుంటాడు. కాని సీట్లేవి? దీనికితోడు రోజురోజుకూ అధికమగుచున్న విద్యాకాంక్షతో క్రింది తరగతులనుండి విద్యార్థులసంఖ్య విపరీతంగా పెరుగుతోంది. నిరుటి సంవత్సరం (46 మార్చి) స్కూలుఫైనలు పరీక్షలకు కూర్చొనిన సంఖ్య కన్న యీ సంవత్సరపు సంఖ్య పదివేలు హెచ్చు. వీరికి ముందు సంవత్సరం సీట్లెచ్చట దొరకనున్నవి? ఉన్న కళాశాలల సంఖ్య అభివృద్ధి కాలేదు. కళాశాలలలో సీట్లనైనా పెంచుటకు యెట్టి ప్రయత్నమూ జరుగుటలేదు. ఈ సంవత్సరం ప్రభుత్వపు బడ్జటులో సహితము యీ దృష్టి లేదు క్రితం సంవత్సరం రాష్ట్రం మొత్తంలో 20 వేల మంది విద్యార్థులు చదువుటకు సీట్లులేక, చదువునకు స్వస్తిచెప్పుట జరిగినదని విద్యాశాఖామంత్రే అంగీకరించినారు. ఈ సంవత్సరం పెరిగిన విద్యార్థులతో, నూతనంగా స్కూళ్ళు, కళాశాలలు స్థాపించక పోవటంచేత, యీ సమస్య మరీ తీవ్రమవనున్నది. ఇంతేకాదు. ఈ సీట్ల సమస్య యేర్పడినఐదు సంవత్సరములనుండి ప్రతి స్కూలులోనూ యేర్పడిన లంచగొండితనం, నిర్బంధ డబ్బువసూళ్ళు, ప్రిన్సిపాలు—హెడ్ మాష్టర్ల ప్రాపకమునకు పాటుబడుట, మనం నిత్యం చూచుచున్నాము. ఈ పరిస్థితులు యికముందుకూడ సాగవలసినదేనా? విద్యార్థులు శలవల నుపయోగించుకొని విద్యావ్యాప్తికి నిరంతరాందోళన చేయాలి. ఏ ఒక్క విద్యార్థీ సీటులేక చదువుకు స్వస్తి చెప్పవలసిన పరిస్థితులు యేర్పడరాదని నినాదమియ్యాలి.

అదృష్టవంతుడై సీటుసాధించు కొనగలిగి విద్యాలయము ప్రవేశించగానే విద్యావసర సామగ్రి యేది? లేబరేటరీకి వెళితే కాళీగదులు, లైబ్రరీకి వెళితే కాళీబీరువాలు. ఆటస్థలములులేని స్కూళ్ళు, ఆటస్థలములున్నచోట్ల ఆటవస్తువులులేక విద్యార్థిజీవితమును గడపవలసి వచ్చుచున్నది. ఇన్నిలేకపోయినా యెట్లయినా అవస్థపడదామంటే చివరకు క్లాసులలో ఉపాధ్యాయులు, పాఠ్యపుస్తకాలు సహితం శూన్యం. ఇదీనేటి మన విద్యాలయాలస్థితి వీటిని మనం పునర్నిర్మించకపోతే మనం పొందేవిద్య యేమిటి?

ఉపాధ్యాయులులేని విద్యాలయాలు

రోజూ మనం సక్రమమైన విద్యకొరకు ఆందోళనచేయు ఉపాధ్యాయుల కోర్కెలను వింటున్నాం వారికోర్కెలేమిటో మనకు తెలుసు చాలీచాలని జీతాలవల్ల, అర్ధాకలితో, యింటివద్ద సంసారాల వస్తులతో మనకు ఉపాధ్యాయులు విద్యయేమిచెపుతారు ? స్కూలు పాఠాలవదలి యీ స్థితిలో ప్రయివేట్లకు దిగుచున్నారు. క్లాసులలో పాఠములపై శ్రద్ధ లేకుండా పోవుచున్నది మనవిద్య పూర్తిగా దెబ్బతింటోంది ఆర్థికంగా స్థితిగల యేకొద్దిమంది మాత్రమో యీ ప్రయివేట్లకు వెళ్ళగలుగుచున్నారు. ఇక మిగిలిన విద్యార్థులందరి సంగతి యేంగాను ? మన విద్యాభివృద్ధి దృష్టితోనే ఉపాధ్యాయులకు సరియైన జీతాలివ్వాలని మనం ఆందోళన చెయ్యాలి ప్రభుత్వం వీరికోర్కెలను గుర్తించి సమ్మె ప్రారంభము కాకుండగనే పరిష్కరించుసట్లు వత్తిడి తేవాలి. ఇందుకు గ్రామంలోని తల్లి దండ్రులనుకూడ ఉపాధ్యాయుల కోర్కెలవెనుక మనం సమీకరించాలి. ఉపాధ్యాయ, విద్యార్థిదళాలు బయలుదేరి గ్రామగ్రామాలలో యీ నినాదాలు మారుమోగించాలి. ఇట్టికృషి భవిష్యత్తులో నిర్మించవలసిన స్వతంత్ర విద్యా విధానమునకు పునాదిరాయియైవిద్యార్థి, ఉపాధ్యాయ ఐక్యతకు యిదినాంది కాగలదు.

యస్. వి. నరసయ్య

బానిస విద్యావిధానమునకు స్వస్తి

మనకీసమస్యలన్నీ నెత్తిపైనున్న బానిసత్వం — మనం మునిగితేలవలసిన బానిస విద్యావిధానంతో యేర్పడినవే. ఈ బానిస విద్యావిధానమునకు స్వస్తిచెప్పుటకు ఆంధ్రవిద్యార్థులం అనేక పోరాటాలు నడిపాం. విద్యార్థుల యీ ఆందోళనను ప్రభుత్వం గమనించి, స్వతంత్ర విద్యావిధానమును అమలుజరుపుటకు బదులు, యీ ఉద్యమమును మొగ్గలోనే త్రుంచుటకు నిర్బంధవిధానమును ప్రభుత్వం అలుజరిపినది. కాంగ్రెసువారు మంత్రివర్గం స్వీకరించినా, తమ ఎన్నికల ప్రణాళికను అమలుజరుపుటకు యెట్టిప్రయత్నమూ జరపలా. ఎన్నికల ప్రణాళికలో ప్రకటించినట్లు జాతీయ విద్యావిధానమును అమలుజరుపమనినందుకు మన కెదురువచ్చినవి — అరెస్టులూ, లాఠీచార్జీలు ఎన్నికలనాడు విద్యావిషయాలను గూర్చి నాయకులుతాముచేసిన ప్రకటనలను అధికారంలోకి వెళ్ళగనే మరచినా, మనం మాత్రం మరవలేం. అవి మన జీవితానికి సంబంధించిన సమస్యలు మనజాతి భవిష్యత్ అభివృద్ధికి సంబంధించిన కోర్కెలు. అందుకు మనం పోరాటం సాగించాలి. కాంగ్రెసు అధికారం స్వీకరించిన పిమ్మట బానిస విద్యావిధానమునుండి బయల్వెడలుచున్న యీ సమస్యలన్నీ మరీ తీవ్రరూపం దాల్చినవి వీటిని పరిష్కరించుటకు మంత్రివర్గం యెట్టిప్రయత్నమూచెయ్యలేదు. మన మీ శలవులలో బానిస విద్యావిధాన స్వస్తికి బ్రహ్మాండమైన ఉద్యమాన్ని నిర్మించాలి. మన ఉద్యమాలపై ప్రయోగించుచున్న నిర్బంధ విధానాన్ని ఖండించాలి ఇదే మన ముందున్న వేసవి కర్తవ్యం.

ఏ ఆంధ్రవిద్యార్థి ఈమహత్తర కార్యభారాన్ని వదలి శాంతంగా విశ్రమించుదామని కలలు కనగలడు ? మన గ్రామాలలో పోలీసురాజ్యం విచ్చలవిడిగా సాగుతుండగా, జీవితావసర వస్తువుల కరువురాగా, విద్యావిధానమే పతనమయ్యేస్థితి ఏర్పడగా, చేతులు ముడుచుకొని కూర్చుండగలమా ? అది ఆంధ్ర సాంప్రదాయంకాదు. లే ! కార్యాచరణకుదిగు! తమ జీవన్మరణ పోరాటములు సల్పుతున్న మధ్యతరగతి రైతులపోరాట బావుటాతో మనబావుటాను గూడా ఎగురవేయ్ !

పోలీసురాజ్యం అంతరించాలి !
రైతు హక్కులను గుర్తించాలి !
విద్యాలయాలలో విద్యార్థుల జీతాలు పెంచరాదు !

సీట్లకొరత తీర్చాలి !

బానిసవిద్యకు స్వస్తిచెప్పాలి !

ఉపాధ్యాయుల కోర్కెలు అంగీకరించాలి !

— ఈ నినాదాలు వేసవి కార్యక్రమమునకు వేగుచుక్కలు. ముందుకు నడు !!

★

(12 వ పేజీ తరువాయి)

ఉగ్రా వీరస్వర్గం అలంకరించి ఎన్నోయేండ్లు కాలేదు. జాతికంతకూ దుర్గతిఘటిల్లిన యీవిషమదినాల్లో - ఆ బాలవీరుని పవిత్రాదర్శకుసుమాలు వాడిపోయినై. కాని, బహు దీర్ఘ కాలం కారాగారవాసంలో పడి నలిగిపోయి, ఇటీవలనే విడుదలైన అంబికాచక్రవర్తివంటి విప్లవవీరుల ఉత్తేజిత ప్రబోధంతో చిట్టగాంగ్ నగరంలోలో ఇంటింటా వేలకువేలు ఉగ్రాలు ప్రభవించగలరు ! స్వాతంత్ర్యసమరానికి విప్లవ దుందుభి మ్రోగించగలరు !!

గుంటూరు వైద్యకళాశాల :: సి. ఆర్. రెడ్డిగారి కుట్రలు

మా యూనివర్శిటీ విలేఖరి

10 సంవత్సరములనుండి ఆందోళన చేయగా, చేయగా ఈ సంవత్సరం ఆంధ్రదేశానికి రెండవ వైద్యకళాశాలఇవ్వబడి 50 మందివిద్యార్థులతో గుంటూరులో ప్రారంభింపబడింది కళాశాలా ప్రారంభమునుండి అనేక వుపగ్రహాలు యీ ప్రయత్నమునకు అడ్డుతగులుతూ వచ్చాయి వీటన్నింటినీ దాటి కళాశాల ప్రారంభమయ్యేసరికి, విశ్వవిద్యాలయంలోని వుపగ్రహాలు కొత్తగా తలయెత్త నారంభించాయి, దీని వెనుకగాథ యేమిటి?

ప్రారంభమయిన కళాశాలను ఆంధ్ర విశ్వవిద్యాలయం రికగ్నయిజు చేయవలసియుంది. అప్పుడే యిచ్చట ప్యాసయిన విద్యార్థులకు ఆంధ్ర విశ్వవిద్యాలయం డిగ్రీలనిస్తుంది. అందుకని, విశ్వవిద్యాలయం, కళాశాలలోని స్థితిగతులను కనుగొనుటకు ఒక ప్రత్యేక కమిటీని పంపింది ఈకమిటీలో నియమింపబడిన ముగ్గురిలో ఏ ఒక్కరూ వైద్యశాస్త్రంతో సంబంధమున్నవారులేరు ఈ ముగ్గురితో కూడిన కమిటీ ఒక ప్రత్యేకరిపోర్టును తయారుచేసింది అది అతిరహస్యంగా అట్టిపెట్టబడింది అందులోనివిషయములివియని తెలియుచున్నది

"గుంటూరులో ప్రీ రిజిస్ట్రేషను క్లాసులు నడుపుటకు మినహా యెట్టి వసతులూలేవు, పై తరగతులు యిచ్చట జరుపుటయనిన విద్యార్థి అభివృద్ధికి పెద్దగొడ్డలిపెట్టు ప్రభుత్వం వెంటనే తగిన సదుపాయములు కలిగించనిచో క్లాసులను విశాఖపట్నంగాని, మదరాసుగాని మార్చుట అవసరము."

గుంటూరులో కళాశాలను స్థాపించుటకు సి ఆర్, రెడ్డిగారు మొదటినుంచీ వ్యతిరేకమని జగమెరిగిన విషయమే, అందుకు తన పంథాను బలపర్చు రిపోర్టు నిచ్చు కమిటీనొక దానిని కళాశాలలోని పరిస్థితులను పరిశీలించుటకు పంపడం జరిగింది. రెడ్డిగారి యీ కుట్రలను, విచ్ఛినం చేయుటకు మార్చి 14న సమావేశమయిన సెనేటులో శ్రీ యం. వి. కృష్ణారావు గారు ఒక తీర్మానమును ప్రవేశపెట్టారు. అందులో గుంటూరు వైద్య కళాశాలకు అవసరమైన పరికరములు, వసతులు ప్రభుత్వము యేర్పరచుటకు విశ్వవిద్యాలయ సెనేటు ప్రభుత్వంపై వత్తిడి జేయవలయుననీ, చిన్న చిన్న అడ్డంకులను పాటించక గుంటూరు కళాశాలను విశ్వ విద్యాలయం వెంటనే రికగ్నయిజు జేయవలయునని కోరబడినది. "ఆంధ్ర విద్యాభిమాని" రెడ్డిగారు యీ తీర్మానమును చర్చించుటకే అంగీకరించక రూలౌటు చేయటం జరిగింది. మొత్తం 96 మంది సెనేటు సభ్యులతో ముగ్గురు మాత్రం కృష్ణారావుగారి తీర్మానమును బలపర్చారు ఏ ఒక్క యితర సభ్యుడూ నోరుమెదిపిన పాపాన పోలేదు పై పెచ్చు తీర్మానమును త్రోసివేయుచూ రెడ్డిగారు చెప్పిన కారణం మరీ విచిత్రం కలిగించక మానదు "50 మందితో గుంటూరులో కళాశాల పెట్ట పనిలేదు, ఆ 50 మందినీ విశాఖపట్నం కాలేజీలోనే చేర్చవచ్చును కనుక సరియైన వసతులు వెంటనే కల్గించనిచో కళాశాలను రికగ్నయిజు చేయగూడదు"

కళాశాలలు యేవీ, ముఖ్యంగా వైద్యకళాశాలలు సరియైన పరికరములులేకుండా యుండవలయునని యెవరూ కోరరు. అందుకనే నిరుటి సంవత్సరం బడ్జటులో గుంటూరు వైద్యకళాశాల అభివృద్ధికి తగినగ్రాంటు ప్రత్యేకించక పోవుటను విద్యార్థులందరూ నిరసించారు. కనీసం ఇప్పటికైనా ప్రభుత్వం కదలి కళాశాలను అభివృద్ధి పర్చాలని ఆందోళన జేయుచున్నారు.

కాని రెడ్డిగారు, విశ్వవిద్యాలయంగూడ కళాశాల అభివృద్ధికి పూనుకొనవలయుననెడి తీర్మానమును యెందుకు వ్యతిరేకించాలి? మొదటినుండీ కళాశాలస్థాపనకు తన వ్యతిరేకతను, యీ రోజున రెడ్డిగారు మరియొక రూపములో బయటపెట్టుచూ కళాశాలను గుంటూరులోనే లేకుండా చేయుటకు ప్రయత్నించు చున్నారు.

10 సంవత్సరములనుండీ ఆందోళనజేసి విజయం పొందిన ఆంధ్ర ప్రజలు, విద్యార్థులు గుంటూరు కళాశాలను రద్దుచేయనీయరాదు. ప్రభుత్వంఅవసరమైనధనమును ఖర్చుజేసి కళాశాలకు తగిన వసతులు కల్గించునట్లు జూడాలి. సెనేటు సభ్యులు తమ మూకీభావమును వదలి విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షుడు రెడ్డిగారు "రికగ్నిషను"కు యెట్టి అడ్డు కల్పించకుండునట్లు చూడాలి ఇందుకు ఐక్యాందోళన జరపాలి ఆంధ్ర విద్యాభిలాషుల కనీస కర్తవ్యమిది।

దక్షిణాఫ్రికా భారతీయ నాయకులతో ఇంటర్‌వ్యూ:

ఫాసిస్టు స్మట్సు రాజ్యంలో

దక్షిణాఫ్రికా భారతీయ నాయకులైన డా॥ దాదూ, నాయకర్‌లు ఆశియా మహాసభకు ఢిల్లీవచ్చారు. స్మట్సు యొక్క జాతివిద్వేష పంధాకు వ్యతిరేకంగా పోరాడుచున్న యీ వీరులను కలుసుకొని భారతీయ యువకుల, విద్యార్థుల పరిస్థితులను వీరినుండి స్వయంగా తెలుసుకుందామని ఆదుర్దా కలిగింది. ఆంధ్ర యువకులపత్రిక 'నవయుగ' ప్రతినిధినని పరిచయం చేసుకొనగనే ఇంటర్వ్యూలభించింది ఆదుర్దాగా అనేక ప్రశ్నలువేయ ప్రారంభించాను ఓపికతో పరిస్థితుల నన్నింటినీ వివరించి చెప్పారు ఆ వివరాలను ఈ క్రింద యిస్తున్నాను.

ప్రశ్న: స్మట్సు యొక్క జాతి ద్వేష పంధా నిత్య జీవితంలో ఎట్లు అమలు జరుపబడుతున్నది? దీనినుండి నల్ల జాతుల పరిస్థితి ఎట్లు అధ్వాన్నంగా చేయబడుతున్నది?

జబాబు: "జీవించియున్న ప్రతి నిముషంలోను ఈరంగు భేదము మాముందు ప్రత్యక్షమే ట్రాములలోగాని, బస్సులలోగాని, హోటళ్ళలోగాని, చివరకు సినిమాలు, టీ షాపులు - ఒకటేమిటి ప్రతిచోటా 'యూరపియనులకు మాత్రమే' అని తగిలించబడిన హేయకరమైన బోర్డులు ప్రత్యక్షం. ట్రాములలోను, బస్సులలోను పై అంతస్థులో చివరి మూడుసీట్లనూ నల్లజాతులకు ప్రత్యేకించుతారు. ఈ సీట్లుమినహా మిగిలినవి ఖాళీగావున్నా కూర్చొనుటకు మాకు అధికారములేదు చివరకు పార్కులలోగూడ బెంచీలపై 'యూరపియన్‌నులకు మాత్రమే'యనెడి బోర్డు ప్రత్యక్షం. పట్టణంలోయుండే మలమూత్ర విసర్జన గదులలో గూడ రంగుభేధాన్ని సూచించే యీ బోర్డులుప్రత్యక్షం. వీటిని నల్ల జాతి ప్రజలెవరూ వుపయోగించుటకు వీలులేదు. ఎటుతిరిగినా యీ రంగుభేదం ప్రత్యక్షం అధమం మా పిల్లలుగూడ పార్కులకుపోయి ఆడుకొనుటకు హక్కులేదు అచ్చటి ఉయ్యాలలకుగూడ 'యూరపియనులకు మాత్రమే'యని తగిలించబడి యుంటుంది

ప్రశ్న ఈ జాతిద్వేషపంధావల్ల భారతీయుల — నల్ల జాతులందరి - విద్యాపరిస్థితులు ఎట్లు దెబ్బకొట్టబడుచున్నవి?

జబాబు భారతీయ విద్యార్థులు చదువుకొనుటకు వీలున్నది 4 సెకండరీస్కూళ్ళలో మాత్రమే అందుచే వందల మంది ప్రాధమికవిద్య అనంతరం విద్యకు స్వస్థిచెప్పవలసి వచ్చుచున్నది చదువుకొనుటకు తగిన వసతులు లేకపోవుటచే 30 వేలమంది స్కూలుకు హాజరవు వయస్సుగల్గిన విద్యార్థులువిద్యకు స్వస్థి చెప్పవలసి వచ్చినది.



నాయకర్ దాదూ

'విట్ వాటర్స్ రాండు', 'కేప్‌టౌన్' పట్టణములలోని స్కూళ్ళలోమాత్రం లెక్క ప్రకారం కొద్ది మంది నల్లజాతి విద్యార్థులను జేర్చుకొంటారు.

నేటాలు విశ్వవిద్యాలయంలో భారతీయులలోగాని, ఆఫ్రికాదేశజాతులలోగాని యెవరినీ జేర్చుకొనరు నల్ల జాతుల ప్రజల ఆందోళనా ఫలితంగా, కళ్ళనీళ్ళు తుడుచుటకు సాయంత్రపు క్లాసులను యీ విద్యార్థులకు ప్రత్యేకంగా ఏర్పరచారు. అదీ 'ఆర్ట్సు' కోర్సులు మినహా, యితర వైద్యం, యింజనీరింగు మున్నగు సాంకేతికవిద్యలను వేటినీ నల్ల జాతుల విద్యార్థులకు నేర్పరు. దక్షిణాఫ్రికాలో యున్న భారతీయులందరిలోను నూటికి 80 మంది ఒక్క నేటాలులోనే యున్నారు ఇచ్చట భారతీయ విద్యార్థులకు

భారతీయుల దుర్భరస్థితి

— మా విలేఖరి

ఉన్నతవిద్య పొందే వసతులే లేవు. దీనిఫలితంగా నూటికి 80 మంది భారతీయులకు ఎట్టి విద్యాగంధమూ లేదు. పైన వివరించిన విచక్షతలవలన భారతీయులకు ఉన్నతవిద్యను పొందుట చాలకష్టము. ఈ బాధలు పడలేక ధనవంతులు మాత్రం తమబిడ్డలను యితరదేశములకు విద్యాభ్యాసమునకు పంపుతారు ప్రజాసామాన్యమంతా యెచ్చటికి పంపగలదు? ఇచ్చటయున్నది భారతీయప్రజలలో నూటికి 10 మంది ధనవంతులు, 80 మంది రోజూ రొట్టెకు సరిపోను షంపాదించగల్గుతారు. వీరు తమ బిడ్డలను యితరదేశములకు చదువుటకు పంపవలయునని కలలయినా కనగలరా?

ప్రశ్న: విద్యా విషయములలో భారతీయులపైయున్న ప్రత్యేక నిర్బంధములను, జాతి పక్షపాతములను సూచించే నియమము లేమిటి?

జబాబు "భారతీయులచే స్థాపింపబడిన పాఠశాలలో మినహా, యితరచోట్ల చేరుటకు భారతీయ విద్యార్థులకు స్వాతంత్ర్యం లేదు. వైద్య కళాశాలలోయుండు భారతీయులు ఒకరిద్దరే. క్లాసులలో శవాలను కోసి పరీక్షించే సమయంలో దురదృష్టవశాత్తుఆరోజున తెల్లవాని శవం వస్తే, అచ్చటున్న నల్లజాతి విద్యార్థులందరూ బయటికి నడువవలసినదే. విశ్వవిద్యాలయ జీవితంలో ఆటలలోగూడ యీ రంగు భేదం అమలుజరుపబడుతుంది. నల్లజాతి, తెల్లజాతి విద్యార్థులకు వేరు వేరు ఆటస్థలాలు. నల్ల జాతుల విద్యార్థులతో యూరపియన్ విద్యార్థులు ఆటలు ఆడ తిరస్కరించుతారు.

ఇక స్కూళ్ళలో ఉపాధ్యాయుల విషయం చూద్దాం. నిరుటి సంవత్సరంవరకూ భారతీయ ఉపాధ్యాయులకు — యూరపియనులకు యిచ్చే జీతంలో సగం మాత్రమే యిచ్చేవారు ప్రస్తుతం నూటికి 75 వంతులచొప్పున యిస్తున్నారు. ఈ విభేదం భారతీయ స్కూళ్ళలోగూడ ప్రత్యక్షం. దీనికి కారణం అధమం భారతీయ స్కూళ్ళనయినా నడుపుకొనుటకు ఉన్నత విద్యను పొందిన భారతీయ విద్యావంతులు లేకపోవుటయే. భారతీయ విద్యార్థుల విద్యను కొనసాగించుటకు హెచ్చు జీతాలిచ్చి యూరపియనులను తెచ్చుకొనవలసివచ్చుచున్నది ఈ రంగు భేదమును పాటించుటను గూర్చి మరియొక వుదాహరణ భారతీయ విద్యార్థులు చదువుకొనుటకు ప్రవేశమున్న టెక్నికల్ కాలేజి ఒక్కటి గూడ లేదు ఈ లోటును తీర్చుకొనుటకు భారతీయులే



పూనుకొనినారు. 17,500 పౌనులు (2 లక్షల 70 వేల రూపాయిలు) వసూలుజేశారు దర్బానులో యిట్టి కళాశాలను నిర్మింపవలయునని పట్టణ కౌన్సిల్‌ను యిందుకు అనువయిన స్థలము నివ్వమని కోరారు కాని యూరపియనుల క్రిందయున్న యీ కౌన్సిల్‌కి యీ భారతీయుల ప్రయత్నం అంత రుచించలా. అనువయిన స్థలంలేదని 5 సంవత్సరములనుండి వాయిదాలు వేయబడుతోంది. ఈ లోపుననే ఒక యూరపియను బాలికల స్కూలు నిర్మింపబడింది. దానికి మాత్రం స్థలంకొరత రాలేదు

ఇక ఉచిత ప్రాథమిక విద్యావసతుల విషయం పరిశీలించుదాం. యూరపియనులకు 6 వ తరగతివరకూ ఉచిత విద్యయేగాక పుస్తకములుగూడ ఉచితంగా యిస్తారు 10 వ తరగతివరకూ ఉచితవిద్య గరపుతారు ఇకభారతీయులకా? నిర్బంధ ప్రాథమికవిద్యాపద్ధతే లేదు మూడవ తరగతి వరకు ఉచితంగా బోధించుతారు కాని పుస్తకములు వుచితంగా యివ్వరు ఆఫ్రికాజాతులకుగూడ నిర్బంధ ప్రాథమిక విద్య లేదు ఏడవ తరగతి వరకూ వుచితంగా విద్య నేర్పుతారు. పిల్లల అవసరములనుబట్టి గాక మొక్కు-తీర్చుకొనుటకనినట్లు ఒకటి రెండు పుస్తకాలు వుచితంగా యిస్తారు.

ప్రశ్న జాతివిభేదములకు వ్యతిరేకంగా భారతీయులు నడిపిన పోరాటంలో యువకుల, విద్యార్థుల పాత్ర ఏమిటి?

జబాబు · భారతీయులు జరిపిన ప్రతిఘటనోద్యమంలో జైళ్ళకు వెళ్ళిన 1700 మందిలోను నూటికి 75 మంది 30 సంవత్సరముల వయస్సులోని యువతీ, యువకులే మా పోరాటం ప్రారంభించగనే మాకువచ్చిన ధనసహాయంలో కల్లా పెద్దమొత్తము వెయ్యి పౌనులు (15 వేల రూపాయలు) విద్యార్థులనుండి వచ్చినదే ప్రతిచోటా విద్యార్థులందరూ, చిన్నపిల్లలు సహితం యీ పోరాటంలో ప్రత్యేకశ్రద్ధ తీసికొన్నారు. ప్రతిఘటనా సభ్యులకు యీ బాల బాలికలు కంబళ్ళు, గుడ్డలు, తిండి ప్రోగుజేసికొని వస్తుండేవారు. ప్రతిఘటనాసమితి కోరినదే తడవుగ వందలకొలది బయలుదేరి వచ్చి ప్రతి ప్రాంతమునకు వెళ్ళి కరపత్రాలు పంచేవారు. విరాళములు వసూలు జేసేవారు

అనేక మంది విద్యార్థులు "స్కూళ్ళవదలి వస్తాం. పిలుపివ్వమ"ని ప్రతిఘటనాసమితిపైవత్తిడి తెస్తుండేవాళ్లు పరిస్థితులు అందాకా విషమించలేదని మేము ఆపిలుపు ఇవ్వలా. అయినా శలవులలో వందలకొలది విద్యార్థులు ప్రతిఘటనోద్యమంలో పాల్గొని జైళ్ళకెళ్ళారు

ప్రశ్న: భారతీయులు జరిపిన యీ పోరాటం ఆఫ్రికా జాతులపై యెట్టి ప్రభావమును కల్గించింది?

జబాబు. "దక్షిణాఫ్రికా జనసంఖ్య మొత్తం 1 కోటి 10 లక్షలలోను, 80 లక్షలు యీ ఆఫ్రికావాసులే వీరు భారతీయుల కంటే విద్యావిషయాలలో వెనుకబడియున్నారు ఈ రోజువరకూ ఆఫ్రికాజాతి ప్రజలందరూ వారి వారి పుట్టుపూర్వోత్తరాలను, గుర్తులనూ వివరించే ప్యాసులను జంతువులవలె మెడలో వేసికొని తిరగవలెను ఎచ్చట పడితే అచ్చట పోలీసులు వీరినాపి యీ ప్యాసును చూపించమని కోరవచ్చు" ఆక్షణంలో చూపించనిచో 14 రోజుల కఠిన శిక్ష. ఇట్లే అనేకమైన అవమాన కరమైన నిషేధాజ్ఞలు ఈ ఆఫ్రికాజాతి ప్రజలపై అమలుపర్చ బడుచున్నవి

భారతీయుల పోరాటం వారిలో యిట్టి అవమానకరమైన నిషేధాజ్ఞలనెల్ల పోరాడవలయుననెడి కాంక్షను రగుల్కొలిపింది. మా పోరాటం వారికి మార్గదర్శకంగా కన్పించుచున్నది

మా పోరాట అనంతరం ఆఫ్రికాజాతుల జాతీయ కాంగ్రెసు యీ ప్యాసుల పద్ధతికి వ్యతిరేకంగా ఒక ఉద్యమమును లేవదీయుటకు ప్రయత్నములు జరుపుతుంది. దేశంలోని ఆఫ్రికా ప్రజలందరూ వారువెంట వుంచుకొనవలసిన ప్యాసులనెల్ల తగలబెట్టమని పిలుపిచ్చుటకు ప్రయత్నములు జరుగుచున్నవి భారతీయుల పోరాటం యీ నూతన చైతన్యమును యితర నల్లజాతుల ప్రజలలో కల్గించింది."

ఆంధ్రుల జాతీయక్రీడ

'చెడుగుడు'

ఆంధ్రుల పురాతనఆట చెడుగుడు. కొంతవరకు చరిత్ర చదివిచూస్తే శ్రీ కృష్ణదేవరాయలకాలమునుండి చెడుగుడును ఆంధ్రులు తమ జాతీయక్రీడగా పరిగణించుతూన్నట్లు బోధపడుచున్నది * పురాతనంగా మన తాతముత్తాతలనుండి షుమారు 1925 సం॥వరకూ కుప్పలచెడుగుడు, బ్రిచెడుగుడు అని. వెన్నెలరాత్రులందు, పండుగ సమయాలలోను ఆడేవారు. ఈ కాలంలో చావుబ్రతుకులు అనగా ఒకసారి గెల్చివచ్చినపుడు బ్రతకటం, ఓడిపోయినపుడు చావటము ఆటలో గెలుపు ఓటమిలను తేల్చేవి. ఈ రకమైన ఆట చాల మొరటుతనంగా నుండెడిది.

పాయింట్సు చెడుగుడు

దీనిని అనుభవంగా తీసుకొని Y M C. A. కాలేజి అధ్యాపకులైన "బక్" గారు చెడుగుడు ఆటకు కొన్నినిబంధనలు నేర్పాటుచేశారు. దాని ప్రకారం నియమితమైన కోర్టులో (11 × 6 అ) నియమితమైన ఆటగాండ్రు (ఒక్కొక్కప్రక్క 6 గురు) ఆడవలెనని నిర్ణయమైన కాలంలో ఏ పార్టీవారికి ఎక్కువ పాయింట్లువస్తే ఆ పార్టీవారు గెలిచినట్లవుతుంది ఈ రకంగా ఆట ఆ పద్ధతిలో మార్పులు జరుగుచుండెను 1935 నుండి శాస్త్రీయపద్ధతులతో ఆడుట ఆంధ్రదేశంలో ప్రారంభమైనది. ఈ ఆట గుంటూరుజిల్లానుండి ఇతరజిల్లాలకు వ్యాపించినది ఇలా ఆడుట మొట్టమొదట కొల్లూరు, తెనాలి, కోలవెన్ను, యలమర్రు మొదలగు కేంద్రములలో ప్రారంభమైనది.

ఆటలోమార్పు: టెక్నిక్ అభివృద్ధి

పాయింట్సు చెడుగుడు వల్ల మంచి నేర్పరితనంగల ఆటగాడు ఒక్కసారి ఏదో లోపమువల్ల ఒక పాయింటు పోగొట్టినప్పటికీ, తన చాకచక్యమును, నేర్పరితనమునూ ఉపయోగించి ఇంకా ఎక్కువ పాయింట్లు తెచ్చుకొనుటకు, తద్వారా తమటీము గెల్చుటకు వీలౌతుంది. అందువలన వారిలో ఉత్సాహం రావటం, చెడుగుడును ఇంకా ఎక్కువ వ్యాప్తిలోకి తీసుకెళ్ళుటకు ప్రయత్నించటం జరుగుతుంది. ఒకే టీముగా ఆడటం అలవడింది ఆటగాండ్రలో పని విభజన జరుగుతుంది. అనగా కోపుకాసేవారు (ప్రక్కలనుండేవారు) ఎదుటి పార్టీవారు కూతకు వచ్చినపుడు కూతఇచ్చేవానినిబట్టి ప్రక్కతిరగటం, పట్టుకొనుటకు ప్రయత్నించటం, మధ్యనుండే ఆటగాడు (Centre player) కూతకూయువాడు ప్రక్కకు దూకునపుడు వాళ్ళను రక్షించుటకు వీలునుబట్టి పట్టుకొనుటకు ముందుకువెళ్ళుట; కోపుకాయువానికి, మధ్యయుండేఆటగానికి మధ్యనిలచేవారు ఎక్కువగా కూతఇచ్చి వచ్చుట జరుగుతుంది మొట్టమొదట కొల్లూరు టీము కలిసికట్టుగా ఆడ మొదలెట్టింది దీనిని చూచి మిగతా టీములు కూడ ఆ పద్ధతిని అనుసరించినవి ఇందువలన ఆటగాండ్రలో సమిష్టిభావము (Team spirt) పెంపొందినది. ఈ రకముగా ఆటలో టెక్నిక్ ఆటగాండ్రలో సహృద్భావమూ అభివృద్ధి అయినది ఈ అభివృద్ధి ననుసరించి ఆడుటవలననే 1945 లో బెంగుళూరులో జరిగిన అఖిల భారత ఒలెంపిక్ పందెములలో చెడుగుడులో ఆంధ్రులు ప్రధమముగా జయం పొందిరి

చెడుగుడు వ్యాప్తి

ముఖ్యంగా డెల్టాప్రాంతాలలోని యువకులు గొర్రిపోతుల పందాలు, పేకాట మొదలగు దుర్వ్యసనాలకు లోనైనారు 1935 నుండి యువకుల అభివృద్ధికి పాటుబడుచున్న యువజనసంఘాలు గ్రామగ్రామాన యువజనసంఘాల నేర్పరచి సంఘకార్యక్రమములో ఆటల కార్యక్రమం ప్రధానమైన భాగంగా తీసుకున్నారు ఇందువలన యువజనసంఘాలతోపాటు చెడుగుడు ఆటకూడ గ్రామగ్రామాన నెలకొల్పబడింది

చెడుగుడు అభిమానులు,

వేమూరి నాగేశ్వరరావు,
కార్యదర్శి.
సిటీ యువజనసంఘం, బెజవాడ

* ఈ ఆటనే బొంబాయి రాష్ట్రంలో "హుతుతు" అనీ, పంజాబ్ రాష్ట్రంలో "కబడ్డీ" అనీ పిలుస్తారు.

డబ్బున్న సర్దాపురుషులు కొంతమంది అక్కడక్కడా చెడుగుడు పోటీలుపెట్టడం, క్రొత్తక్రొత్తగా నేర్చుకున్న టీములవారు ఆయాపోటీలలో పాల్గొనటం, వారి ఆటలను చూచిన క్రొత్తయువకులు తమతమ గ్రామాలలో చెడుగుడు కోర్టులు పెట్టి ఆటనేర్వటం జరిగింది. ఈవిధంగా జరుగుట వల్ల అదివరకు చీట్లపేక, గొర్రిపోతుల పందాలకు అలవాటుపడ్డ యువకులు నెమ్మది నెమ్మదిగా చెడుగుడు ఆటవైపుకు మ్రొగ్గారు. చెడుగుడు ఆటకు ఎక్కువ స్థలం గాని, ఏ వస్తువులుగాని అవసరం లేదు. ఇసుక తోలు కొనుట మినహా ఖర్చేమీలేదు పైగా సాంప్రదాయసిద్ధంగా మన తాత ముత్తాతలనాటినుండి మన మన గ్రామాలలో యువకులనుండి నడివయస్సువారు సహితం ఏదో ఒక పద్ధతి ప్రకారం చెడుగుడు ఆడుచున్నారు. మొట్టమొదట తగిన ప్రోత్సాహ మివ్వకపోయినప్పటికీ తర్వాత విద్యాలయాలల్లోను, గ్రిగ్ స్పోర్ట్సులోను చెడుగుడును ప్రవేశ పెట్టుటవలన చెడుగుడుకు ఒకరకమైన హోదా (Status) వచ్చినది. తగిన రీతిగా వ్యాప్తిలోకి వచ్చినది.

నాకవుట్ బేసిస్ : లీగవుట్ బేసిస్

పై విధానంవలన ఆటగాండ్రలో నిరుత్సాహం, నిస్పృహ వచ్చినవి. పైగా "నా కవుట్ బేసిస్" ప్రకారం ఏఒక మంచి టీముఅయినా, ఒక టీముతో ఓడిపోతే దాని నైపుణ్యాన్ని ప్రదర్శించుటకు గాను, ఆ టోర్నమెంట్సులో తిరిగి ఆడుటకు వీలులేదు. ఈ లోటును తీర్చుటకు యువజన సంఘాలు జిల్లా, తాలూకా, పట్టణ ఒలెంపిక్ పందెములలో లీగవుట్ బేసిస్ ప్రకారం ఆడించటం మొదలు పెట్టినవి. దీనివలన ఒక టోర్నమెంటులో ఏఒక్క టీము అయినా ఓడినా, గెల్చినా అన్నిటీముల మీద ఆడుటకు వీలున్నది ఇందువలన అన్ని టీములకు తమ ఆట ప్రతిభ, టెక్నిక్ జూపుటకు సమానవకాశము లున్నవి. ఆటగాండ్రలో సహృధ్భావం అభివృద్ధి అవుటకు, సమిష్టిభావము పెంపొందుటకు ఎక్కువ మంది ఆటగాండ్రు ఆటలలో పాల్గొనుటకు అవకాశమున్నది. కృష్ణా జిల్లాలో ఈక్రింది సంవత్సరములలో ఈక్రింది విధముగా ఆటగాండ్రు పాల్గొన్నారు.

పత్రికలు, నాయకులూ ఆటలకు ప్రచారము, ప్రోత్సాహమూ ఇవ్వాలి!



చెడుగుడు అంటే యువకులలో వచ్చిన ఉత్సాహాన్ని చూచి అనేకమంది ప్రయివేటు టోర్నమెంట్సు పెట్టారు. కాని ఇలా పెట్టినవారు యువకులను శారీరకంగా అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతోకాక డబ్బుండి సర్దాదృష్టితో పెట్టుట వలన ఆటగాండ్రకు అనేక అన్యాయాలు జరిగినవి. కొన్ని కొన్ని టోర్నమెంట్సువారు డబ్బుయిచ్చి ఆటగాండ్రను తెప్పించి ఆడించటం జరిగింది దీనివలన కిరాయి ఆటగాండ్రు బయలుదేరినారు. అటగాండ్రలో ఆటగాండ్రకుండవలసిన సలక్షణం (Sports man spirt) చచ్చిపోవటం,సమిష్టిభావంపోయి ఎవరికి వారే గొప్ప ఆటగాండ్రమనిపించు కోవాలనే ఉద్దేశాలు కలగటం జరిగింది. టోర్నమెంట్సు పెట్టిన వారు ప్రేక్షకులకు టిక్కెట్లు పెట్టడం, ఎక్కువడబ్బు సంపాదించుట- ఈ విధంగా మంచి చెడ్డలు చూడకుండ 'చెడుగుడను' వ్యాపార ఆటగా తయారుచేయటం జరిగింది దినివలన చెడుగుడు కొంత వ్యాప్తిచెందినా టెక్నిక్ అభివృద్ధి కాలేదు.

	సం॥లో	మంది	టీములు
1944	..	1360	80
1945	..	2500	100
1946	..	2722	158

యువజన సంఘాలు : ఒలెంపిక్ పందెములు

మన రాష్ట్రములో యువజన సంఘాలు ఒలెంపిక్ పందెములు జరుపునపుడు ముఖ్యంగా చెడుగుడు ఆటలో పాల్గొనే ఆటగాండ్రను సమావేశపర్చి చెడుగుడు మీద వారి అనుభమును, అభిప్రాయములను తీసుకొనుటవలన ఆటలు నడిపే వారికిని, ఆటగాండ్రకును మధ్య దగ్గఱ సంబంధ మేర్పడు చున్నది ఇందువలన ఆటగాండ్రకు అన్యాయాలు, లోట్లు జరుగుటకు అవకాశంలేదు ఆటగాండ్రు ఒకరి అభిప్రాయములను ఒకరు తెలుసుకొని ఉత్సాహపడుచుండిరి.

చెడుగుడు : ఉపయోగము

చెడుగుడు ఆడినపుడు శరీరమంతయు (చేతులు, కాళ్ళు,

కాలచక్రం ఆగదు సుమా!

ప్రస్తుత సమాజంలో మంచిచేసి గణుతికెక్కటం గగన విషయం. తుపాకీ మార్గాన్ని అవలంబించితే-అది చెడ్డపేరే కావచ్చు-తేలికగా నలుగురి నోళ్లలోనూ పడొచ్చు ఎంతోమంది మహాపురుషులు మానవ కళ్యాణంకోసం కృషిచేసి అమరత్వం పొందారు కాని హిట్లర్ హింసాకాండ జరపటంద్వారా ప్రపంచానికి తెలిసివచ్చాడు ఈ రెండుమార్గాలలోను ఎంతో భేదంవుంది.

మన విద్యా ప్రపంచంలో తీసుకున్నా అంతే. ఎంతమంది మహావ్యక్తులు జాతీయ విద్యా విధానంకోసం తమ జీవితాలను ధారవోసి ధన్యులుకాలేదు. శ్రీ కాజ శివరామకృష్ణయ్యగారు మాత్రం హిట్లరు యిత్యాదులను అనుసరించి. తన 'పావన' చరిత్రను పెంచుకుంటున్నారు కాలధర్మాన్ని గుర్తించలేని - గుర్తించినా అంగీకరించని - కాలంతోపాటు పరుగెత్తలేని కొందరి దుర్బలులకు ప్రతినిధి బందరు ప్రిన్సిపాల్ అట్టి ప్రాతినిధ్యం వహించే ప్రిన్సిపాల్ 'పావన' చరిత్రను వారిముఖానే చదివి పుణ్యం కట్టుకుంటున్నాం.

అది 1938వ సంవత్సరం. సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమ పొంగులు వెల్లువలై పారుతోంది స్వాతంత్ర్య పోరాటంలో ప్రధానపాత్ర వహించే విద్యార్థులు సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా పోరాట శంఖారావం విద్యాలయాల నుండి పూరించారు. తద్వారా బానిస విద్యా విధానానికి స్వస్తి చెప్ప కంకణం కట్టారు. దీనితో సామ్రాజ్య వాదులకు చలిజ్వరం పట్టుకొని గడగడ వణక నారంభించారు. వారి పరాన్న భుక్కులు సైతం కళ్ళు తేలేసారు

ఆ దశలో బందరుకాలేజీలో మొట్టమొదటిసారిగా సమ్మెవచ్చింది. తమ్మారెడ్డి సత్యనారాయణ వంటివారు నాయకత్వం వహించారు శ్రీ శివరామ కృష్ణయ్యగారికి తేళ్ళు జెర్రులు ప్రాకాయి విద్యార్థులపై కార్పణ్యం వహించాడు కారణం? సామ్రాజ్య వాదులు సాగనంపబడితే తమ రక్షణలేనిపక్షిని అవుతానేమోనని భయం. దఱన్నకొద్ది సమ్మె నాయకులను వెళ్ళగొట్టి పుణ్యం కట్టుకున్నాడు ప్రభుభక్తి పరాయణత వ్యక్తపరిచాడు బందరు ప్రిన్సిపాల్. వ్యక్తులను వెళ్ళగొట్టితే ఉద్యమం నశిస్తుందా? యిట్లా జరిగితే 'జలియన్ వాలాబాగ్'లాంటి ఘోర హింసలు జరిపిన పిమ్మట లక్షలాది స్వాతంత్ర్యవీరులను జైళ్ళకు పంపిన మీదట మన జాతీయోద్యమం నామరూపాలు లేకుండా పోవాల్సింది. ఇది అభివృద్ధి నిరోధకులు గతిరోధ చేసే చర్యలు మాత్రం కాని కాలచక్రం ఈ ఆటంకాలను నిర్దాక్షిణ్యంగా అధిగమిస్తూ పోతూంది ఇదే బందరు విద్యార్థి ఉద్యమం శ్రీ రాజుగారికి నేర్పే గుణపాఠం బందరు ఆచార్యులవారిని సూత్రం ఒకదానికి 'అభినందించాలి' సామ్రాజ్యవాదులకు నమ్మినబంటు పెట్టనిప్రతినిధి ఎంతవిశాల హృదయం వుంది? అందుకే ఆ పీసురూములో చక్రవర్తి ఫోటో. విద్యార్థులకందగా, విద్యార్థుల కోర్కెలను అంగీకరించమని—ఆటలకు వసూలుచేసిన సొమ్మును ఆటల కేవ్యయం చేయమన్నందుకు—మల్లవరపు రామకృష్ణారావును నిరంకుశంగా కాలేజీనుండి వెళ్ళగొట్టాడు బందరు ప్రిన్సిపాల్. ఓ మహానుభావా! నీ బుద్ధికుశలతకు చర్చిల్ కంపెనీనుండి ధన్యవాదాలు పొందు. పొంది, ఆ శుభాశీస్సులతో నాల్గు కాలాలపాటు వర్ధిల్లు! కీ॥ శే॥ హేమచంద్ర భాస్కరరావును వెళ్ళగొట్టిన 'మహామనుడు' బందరు ప్రిన్సిపాల్. వాక్‌స్వాతంత్ర్యం కావాలని కోరినందుకు నీచాతినీచమైన "దీవెన"లతో గోవరి శారదను కాలేజీనుండి వెళ్ళగొట్టిన 'దేవతాసంభూతుడు', 'స్వాతంత్రపిపాసి' దీనితనస్పోదియ్యా, యిన్ని కట్టలుకట్టినా ఉద్యమ ప్రవాహము కట్టలు త్రెంచుకు పోతోందే! దీర్ఘంగా. లోతుగా ఆలోచించాల్సిందే నా మాట విని, శివరామకృష్ణయ్యగారూ! పోయి నీ ఆత్మీయుడు హిట్లరును — పాపం ఏలోకాన వున్నాడో — పోనీ చర్చిల్‌తో సలహా చేసిరండి

తరువాత జి జగన్నాధరెడ్డిపైకి మీ 'కరుణా' దృష్టి ప్రసరించింది. ఓ! కరుణా నిధీ! మీ కన్నువెంట 'కరుణ' కారాలేగాని 'శుభం' తప్పక జరిగితీరుతుంది రెడ్డిని కాలేజీ నుండి వెళ్ళగొట్టి 'పావనుడ' వయావు. వెళ్ళగొట్టి వూరుకొనే ఘనుడవా! వెళ్ళగొట్టటంతోపాటు పారితోషకాలు యిస్తావ్ పారితోషికం ఏమిటని ఆంధ్ర ప్రజానీకం అడుగుతోంది "రెడ్డి దెయ్యం. భూతం, రెబెల్‌రెడ్డి" మొత్తానికి నీ పాలనచరిత్రకు తగ్గ పారితోషకం యిచ్చారండీ!

గురించి సర్టిఫికెట్ యిద్దామనుకొంటున్నావా? బాబూ! ప్రవర్తన విషయంలో నీ సర్టిఫికెట్‌కు ఆంధ్ర దేశంలో విలువలేదని చెప్పటానికి విచారిస్తున్నా పగవానికికూడ నీప్రవర్తన వద్దు విద్యార్థినులనుగూర్చి 'సుభాషితాలు' "అత్తరు బుడ్డి" అనసరం కానీ గుమ గుమలాడుతున్నాయ్ హాస్యానికి ఓ 'సత్యసంధ'! విద్యార్థులు కాలేజీని స్వాయత్తం చేసే ప్రభుత్వానికి రిపోర్టు పంపి నీ 'సత్యసంధతను' నిరూపించుకున్నావు విద్యార్థులు చేసే "క్రౌర్యాలను" ఏ నిముషానికి ఆ నిముషం పోలీసులకు రిపోర్టు పంపి నీ "శీలత్వాన్ని" చాటుకున్నవు.


కులద్వేషం నీకున్న "సుగుణాల"లో ఒకటి ఈ అన్ని ద్వేషాలు కలసి దోషాల మాలగా నీ "పవిత్ర"కంఠాన్ని అలంకరించి "పునీత" మయాయి

నీ యిష్టదేవత "స్వస్తిక్" నాశనమైంది అందువల్ల స్వస్తిక వుంగరం చూసు కొన్నా లాభం శూన్యం. పోతే నీ ఆత్మీయుడు హిట్లరు నామరూపాలు లేకుండా నాశనమయాడు. కలికాలం!

నేడు ప్రపంచం రెండు కూటాలుగా మారింది అభివృద్ధి కాముకులు—అభివృద్ధి నిరోధకులు అభివృద్ధికాముకుల ప్రతిభ దేదీప్యమానంగా వెలుగొందుతుంటే అభివృద్ధి నిరోధకులుకొడి కట్టారు బందరు ప్రిన్సిపాల్ కొడి కట్టినా ఆరకముందే మేలుకోవాలి.

ఖమ్మం విద్యార్థుల అరెస్టు

ఖమ్మం హైస్కూలులో చదువుచున్న పుల్లయ్య. సత్యంగార్లు 26-6-46 తేదీన కమ్మహాస్టల్‌లో నైజాం పోలీసులు అరెస్టు చేసారు వీరు తమ గ్రామంలో జమీందారీ నిరంకుశత్వానికి రైతు. కూలీలు జరిపిన వ్యతిరేక ప్రదర్శనంలో పాల్గొన్నారని నేరం ఆరోపించారు తమ తల్లితండ్రులతో పాటు వారి కష్టసుఖాలకు అండగా నిలబడినందుకుశిక్ష వీరిని అరెస్టుచేసి, జమీందారు కొట్టులో బంధించటం చేతులకు బేడీలు వేయటం జరిగింది గ్రామాలు. విద్యాలయాలు కాన్‌సెంట్రేషన్ క్యాంపులుగా మారుతున్నాయి. ఇది 'స్వతంత్ర హైద్రాబాదు' లోని రాజ్యాంగ పద్ధతులకు కాంప్లిమెంట్



హరిజన్ విద్యార్థులు-సీట్లు

ఆర్యా!

మద్రాసు ప్రభుత్వం ఏప్రియల్ 29 న హరిజన విద్యార్థుల విద్యావిషయంను గూర్చి ఒక ప్రకటన జేసింది దీని ప్రకారం వృత్తి విద్య కళాశాలల మినహా-రాష్ట్రంలోని ఇతర విద్యాలయాలన్నింటిలోను నూటికి 10 చొ॥న మొత్తము సీట్లలో హరిజన విద్యార్థులను జేర్చుకొనవలయునని నిర్ణయించారు. నేడు ప్రతిచోటా సీట్లులేక బాధపడు చున్నప్పుడు వెనుకబడిన హరిజనుల విద్యాభివృద్ధిని గోరి యిట్లు కొన్ని సీట్లు నిర్ణయించుట శుభసూచకమే. అందుకు ప్రభుత్వమును అభినందించ వలసియున్నది.

కాని కొన్ని యదార్ధ విషయములను ప్రభుత్వదృష్టికితెచ్చుటఅవసరమని తలుస్తాను. రాజధాని మొత్తంలో కళాశాలలో 24 996 మంది విద్యార్థులుంటే, అందులో 274 మంది మాత్రమే హరిజనులు (1945 సం॥ ప్రభుత్వపు లెక్కలు) దీనినుండి స్పష్టమయ్యేదేమిటి? హరిజనులవంటి వెనుకబడిన తరగతుల విద్యాభివృద్ధికి కృషి సల్పుటకు సీట్లు రిజర్వు చేయించగనే చాలదు హరిజనులు నేటి బీదతనంతో విద్యను పొందలేకుండా వున్నారు. కనుక కనీసం యీసంవత్సరం రిజర్వు చేయించిన సీట్లన్నింటికి సరిపోను హరిజన విద్యార్థులు విద్యాలయాలలో ప్రవేశించుటకు ప్రత్యేక విద్యావేతనాలు యిచ్చుట అత్యవసరం.

దీనితోపాటు నేడు హరిజన విద్యావేతనాల పేర యిస్తున్న సహాయాన్ని గూడ వేరు పద్ధతులలో నడపాలి. ఈ విద్యావేతనాలు ప్రతి నెలా ముందు యివ్వాలి. నేటివలె మూడు, నాలుగు నెలలకొకసారి డబ్బు యిస్తూ వచ్చిన ముందు హరిజన విద్యార్థులు ఎచ్చట నుండి తెచ్చి పెట్టుబడి పెట్టగలరు? పై పెచ్చు నేటి యీ విద్యావేతనం కనీసపు ఖర్చులకు గూడ సరిపోవుటలేదు. కనుక ప్రభుత్వం నేడు హరిజన విద్యావేతనం క్రింద యిచ్చు మొత్తమును భోజనం, పుస్తకముల ఖర్చులకు సరిపోను యివ్వాలి

సంవత్సరంక్రితం కొన్ని జిల్లాబోర్డులు హరిజన విద్యార్థులకు లేని అర్ధ జీతాన్ని ప్రవేశపెట్టాయి ఇదికూడ విద్యావ్యాప్తికి గొడ్డలి పెట్టువంటిది. కనుక హరిజన విద్యాభివృద్ధి ఆశించి ప్రభుత్వం పై సూచనలను అమలు పర్చుతుందని ఆశించుతాం, అప్పుడే నేటి ప్రభుత్వ ప్రకటన యేమైనా ఫలితం కలుగ జేయగలదు.

ఇట్లు
ఆర్థిక యిబ్బందులచే చదువుకు
స్వస్థిచెప్పిన ఒక హరిజనవిద్యార్థి.

రూరల్ రిక్రియేషన్ ఆఫీసర్లు

ఆర్యా!

1937 లో కాంగ్రెసు అధికారంలోకి వచ్చినప్పుడు మద్యపాన నిషేధచట్టాన్ని ప్రవేశపెట్టారు. మద్యపానానికి అలవాటు పడిన ప్రజల మనస్సును యితర విషయాలపైకి త్రిప్పుటకని - గ్రామములలో ఆటపాటల కార్యక్రమాన్ని అమలు జరుపుటకు "రిక్రియేషన్ ఆఫీసర్ల"ను నియమించారు. ఈ "రిక్రియేషన్ ఆఫీసర్ల"కు ప్రత్యేకంగా నియమితమైన కొన్ని భాగాలిచ్చి అచ్చట ప్రజా జీవితంలో సంబంధంపెట్టుకొని పనిజేయుటకు ప్రత్యేక గ్రాంటులు యివ్వబడినాయి

కాంగ్రెసు తిరిగి అధికారంలోనికి వచ్చిన పిమ్మట తిరిగి మద్యపాన నిషేధ కార్యక్రమాన్ని అమలు పర్చ పూనుకున్నారు అందుకని వివిధ జిల్లాలలో యీ "రిక్రియేషన్ ఆఫీసర్ల"ను నియమించారు, మొన్ననే మద్రాసులో యీ ఆఫీసర్లను ఆటపాటల విషయంలో తర్ఫీదిచ్చుటకు వై, యమ్, సి ఎ వ్యాయామ కళాశాలలో ప్రత్యేక తరగతులు నడిపారు.

కాని ఆచరణలో యీఆఫీసర్లు అమలు జరుపుతున్న కార్యక్రమం ఏమిటి? ప్రజలతోను, వారినిత్యజీవితంతోను వీరికెట్టి సంబంధమూ లేదు ప్రభుత్వమిచ్చిన గ్రాంటులతో నామకా ఆటల పోటీలను జరుపుతారు, ఈ ఆటలపోటీలను గూర్చి ప్రజలకు, యువకులకు తెలియదు గ్రామాలలో ఆటలకని ఖర్చుపెట్టుటకు ప్రత్యేకించిన మొత్తాలను తమ ముఖ్యలవిలాసాలకు మాత్రం ఖర్చుపెట్టుట జరుగుతున్నది

నేటి "రూరల్ రిక్రియేషన్ ఆఫీసర్లు"తమ మార్గమవలంబించుట అవసరం నేడు వివిధ గ్రామములలో యువజన సంఘాలు, యువకులు సాంఘిక అభివృద్ధికి ఆటపాటల కార్యక్రమంపై పనిజేస్తున్నాయి. కాని యీ రిక్రియేషన్ ఆఫీసర్లు యువజన సంఘాలకు ఎట్టిసహాయం జేయుటలేదు కనుక యీ ఆఫీసర్లు నియమింపబడిన ప్రయోజనం వుండుటకు వీరికి యువజన సంఘాలతో సంబంధముండాలి, ఆఫీసర్లు యువకుల వసతులను గూర్చిఆలోచించాలి ప్రభుత్వ బాధ్యతతో ప్రతిగ్రామంలోను ఆటస్థలం; వస్తువులు సప్లయి జేయబడాలి ఈ మార్గంలో నేటి రిక్రియేషన్ ఆఫీసర్లను ప్రభుత్వం నడపినప్పుడే ఏమైనా ఫలితం వుంటుంది. లేనిచో యీ ఆఫీసర్లపై ఖర్చుపెట్టు లక్షల కొలది ప్రజాధనం శుద్ధదండుగ కాగలదు.

ఇట్లు
వై. వి. కృష్ణారావు,
కార్యదర్శి: కృష్ణాజిల్లాయువజన సంఘం.

[illegible]కు జరిగిన అన్యాయం


ఆర్యా,

మద్రాసు విశ్వవిద్యాలయము వారు యీ సంవత్సరము ప్రకటించిన ఇంజనీరింగ్ పరీక్షా ఫలితాలు చాల అసమగ్రముగను, ఘోరముగను వున్నవి ఆంధ్ర విశ్వవిద్యాలయములో పరీక్షకు కూర్చున్న 105 మందిని అంతా వుత్తీర్ణులను చేయగా, మద్రాసు విశ్వవిద్యాలయము వారు పరీక్షకు కూర్చున్న దాదాపు 350 మంది లోను 90 మంది నెంబర్లు వేయకపోవటంలో, విద్యార్థులు ఆందోళన పడుతున్నారు, ప్రతి సంవత్సరం నూటికి పదిమందిని ఆపివేయుట మామూలుకాగా, యీ సంవత్సరము నూటికి 30 మందిని ఆపుటలో విద్యాలయము వారి మనస్తత్వము దురూహ్యముగనున్నది.

నూతనముగ ఎన్నో ప్రాజెక్టులను నిర్మించుటకు సన్నాహములు జరుగు యీసమయంలో యీ వూచకోత దేశానికెంత అనర్ధమో చెప్పనక్కరలేదు

ఒక గ్రూపులో ప్యాసై, రావలసిన 300 మార్కులు వచ్చిన విద్యార్థులు మరు సంవత్సరము చదువుటకు అర్హులయ్యే వారినెంబర్లు పత్రికా ముఖమున తెలియపర్చకుండుట చిత్రముగనున్నది అందుచే విద్యార్థులు ఆందోళన పడుతున్నారు వెంటనే యీ 90 మందిలోను మూడువంతులు పైగా కాలేజీల్లో చేర్చుకొనవలసియున్నది.

(మిగతా 22 వ పేజీలో)



నేటి భారతదేశం

★

రచన ; రజనీ పామీదత్తు

(ప్రపంచ విఖ్యాత మార్క్సిస్టు రచయిత శ్రీ రజనీ పామిదత్తుచే వ్రాయబడిన 'నేటి భారతదేశం' కొద్దినెలల క్రిందటే తొలిసారిగా భారతదేశంలో ప్రకటింపబడింది. తెలుగు అనువాదం ప్రజాశక్తి ప్రచురణాలయం వారు ప్రచురిస్తున్నారు. 'నేటి భారతదేశం'ను భారత విద్యార్థులకు పరిచయంజేస్తూ "దిస్టూడెంటు"లో ప్రముఖ ఆర్థిక శాస్త్రవేత్త, బొంబాయి విశ్వవిద్యాలయములో అధ్యాపకులయిన ప్రొఫెసరు వాడియా వ్రాసిన సమీక్షను ఆంధ్రయువకులకు సమర్పిస్తున్నాం. ప్రతి ఆంధ్రయువకుడూ "నేటి భారతదేశం"ను తప్పక చదువుతాడని ఆశించుతాం) —సంపాదకులు

"తొలిసారిగా భారతదేశంలో ప్రకటింపబడుతున్న పామీదత్తు "నేటి భారతదేశం" గ్రంథ ప్రచురణకు మా స్వాగతం. ఈ గ్రంథం ప్రప్రథమంగా ఇంగ్లండులో 1940 లో ప్రకటితమైంది; కాని భారతదేశంలో నిషేధింపబడింది. అప్పట్లో ఇంగ్లండులో ఉన్న సరుకు యావత్తూ విమాన దాడులవల్ల నాశనంకావడం సంభవించింది. ఇప్పుడు గ్రంథకర్త దీన్ని తాజాగా పరిష్కరించి ప్రకటించాడు.

"అతివాద దృక్పథంతో, బ్రిటిష్ ఇండియాలోని ఆర్థిక, రాజకీయ సమస్యల్ని గురించి చేసిన సమగ్ర సమీక్షయే యీ గ్రంథాంశం. కేవలం గత చరిత్రను సింహావలోకనం చెయ్యడమేగాక, ఈనాడు భారతదేశాన్నెదుర్కొంటున్న అనేక సమస్యల్ని నిర్దుష్టంగా చర్చించడం, రచయిత సిద్ధాంతాలకే ముఖ్యలక్షణమైన ఆశాభావాన్ని సర్వత్రా ప్రదర్శింపడం - యివీ గ్రంథంలో ముఖ్యంగా అభినందించదగ్గ అంశాలు.

మిస్తున్నదనడం నిర్వివాదం. పోరాటంద్వారా చైతన్యం పొందిన కర్షక, కార్మిక శక్తులు నేడు ఉజ్జ్వలమైన భవిష్యత్తుకు సాగిపోతున్నాయి. సంపూర్ణ స్వాతంత్ర్యం కొరకు భారత ప్రజానీకం జరిపే యీ పోరాటంలో వారికి ప్రపంచ కార్మికుల, ఇతర అభ్యుదయకర శక్తుల సానుభూతి అండగా నిలువగలదు -" అని ఆయన వ్రాశాడు.

"రెండవ అధ్యాయంలో, భారత దేశపు జనసంఖ్య అసంఖ్యాకంగా పెచ్చు పెరిగిపోతున్నదన్న వాదాన్ని ఖండిస్తూ-గ్రంథకర్త యిదే ఆశాభావాన్ని ప్రదర్శించాడు. ఉత్పత్తి అయిన ఆహార పరిమాణంకంటె జనాభా పరిమితి ఎక్కువకాదని ఆయనవాదం. ప్రస్తుతం తిండికొరత కలగడానికి గల కారణాలు



పామీ దత్తు

ఉత్పత్తి విధానమూ, భూస్వామిక పద్ధతులే గాని, జనసంఖ్య పెరగడం ఎంతమాత్రమూ కాదు.

"గత శతాబ్దపు ద్వితీయ, తృతీయభాగాల్లో భారత సమస్యను సమగ్రంగా పరిశీలించిన మార్క్స్, ఏంగిల్సు రచనలనుండి అనేక ఉదాహరణలను సేకరించి, ప్రచురించడం— యీగ్రంథంలోని మరొక విశిష్టత. అయితే, నేటి భారత దేశంలో నవసాంఘిక వ్యవస్థా నిర్మాణానికనువైన' పరిస్థితులు ప్రత్యక్షంగా ఉన్నాయా అన్నదొక ప్రశ్న.

"యుద్ధంమూలంగా భారతదేశం మరింత పేదతనం పొందింది. యుద్ధభార ఫలితంగా, భారతదేశపు ఆర్థికపరిస్థితి చక్కబరిచే అవకాశం కాస్తా భగ్నమైంది. నేటి భారతదేశం

[illegible]

తిండికి మాడిపోతున్న ప్రజానీకాన్ని యీ యుద్ధం మరింత కుంగదీసింది -" ఇవీ రచయిత అభిప్రాయాలు.

మనల నెదుర్కొంటున్న క్లిష్టసమస్యల్ని రచయిత చక్కగా అర్థంచేసుకున్నాడని నిరూపించడానికే యీ ఉదాహరణ లివ్వబడ్డాయి. ఈ సమస్యలు కేవలం ఆర్థికమైనవేకావు. సాంఘిక, రాజకీయములైనవికూడ, ఈ గ్రంథంలో 1946 నూతన రాజ్యాంగప్రతిపాదనల సమీక్షతోసహా స్వాతంత్ర్యోద్యమ పరిణామ చరిత్ర సంగ్రహంగా నిరూపించబడింది. 1935 సం॥ర చట్టాన్ని గురించిన విమర్శకూడా యిందులో ఉంది. ఏవిధమైన "ఫెడరేషన్" రాబోతుందో యోచించకుండా, ప్రతివాడూ భారతదేశానికి ఫెడరల్ ప్రభుత్వం కావాలని అంగీరించే యీ సమయంలో - యీ విమర్శ, పాఠకునికెంతయినా ప్రయోజనకారి కాగలదు. 'ఫెడరేషన్' అంటే 'వివిధ స్వతంత్ర రాజ్యాల స్వచ్ఛంద సమాఖ్యఅని నిర్వచనం. ప్రస్తుత గ్రంథంలో రచయిత యీ 1935 రాజ్యాంగ ప్రతిపాదనను 'ఫెడరేషన్' అనడం కేవలం అసంగతమనీ, అభివృద్ధి నిరోధకమైన నిరంకుశ నియంతృత్వాన్ని సృష్టీకరించే భాషాడంబరమనీ విమర్శిస్తూ-బ్రిటిష్ ఇండియాలో విద్వేషాలనూ విభేదాలనూ ప్రజ్వలింపజేసే ఉద్దేశంతో నిర్మించబడ్డ యీ చట్టంలోని అసలు బండారాన్ని బయటపెట్టాడు.

ఇక భవిష్యత్తు సంగతేమిటి ? గ్రామస్వరాజ్య సిద్ధాంతాలమీదనే భవిష్యద్భారతాన్ని మనం నిర్మించాలా ? తిరిగి పాతపద్ధతులమీదే అరకదున్నుకుంటూ, రాట్నం వడుక్కుంటూ, మనం ఆర్థికవిధానంలో శతాబ్దాలు వెనక్కుపోవాలా ? "సెంట్రలైజుడు మాస్ ప్రొడక్షన్ విధానంవల్ల వెనకబడిన దేశాలుకొన్ని అనర్థం పొందినంత మాత్రాన మనం మాస్ ప్రొడక్షన్‌ను గానీ, దానికి మూలమైన యంత్ర విధానాన్ని గానీ బహిష్కరించాలా?

ఈరచయిత పై విధానానికి కేవలం ప్రతికూలుడు పారిశ్రామికోద్ధరణమూ, వ్యవసాయిక పునర్వ్యవస్థీకరణమూ-జరగాలని ఆయనకోరిక కాని పరిశ్రమల విషయంలో - పీడిత ప్రజానీకం శ్రేయస్సే మా లక్ష్యమని పైకిచాటుతూ లోలోపల వ్యష్టివ్యాపారాన్నీ. వ్యక్తిలాభాలనూ ప్రోత్సహించే పెట్టుబడిదారీ వర్గాన్నుంచి దూరంగా ఉండాలని రచయిత హెచ్చరిక వ్యావసాయిక పునర్వ్యవస్థీకరణంగూ

చిన్న భూములన్నిటినీ కలిపి సమిష్టిక్షేత్రాలుగా మార్చడం మొదలైన పద్ధతులద్వారానే సాధ్యం కాగలదని ఆయన వాదం

అద్యతన భావిలోనే ప్రపంచమంతటా వర్గ రహితసమాజం ప్రవర్ధిల్లగలదనీ, అందులో భారతదేశం అగ్రస్థానం అలంకరించగలదనీ- ఏవేవో కలలు కనలేదు రచయిత. మార్గమూ సుదీర్ఘమూ, దుర్గమమూను ఒక్కసారిగా గమ్యాన్ని చేరగల మనుకోవడం భ్రమ. సామ్యవాద జీవిత విధానాచరణమే భారత దేశంలో మరునాటి దశ అనుకోవడంకూడా భ్రాంతిమూలకమే ఇండియావంటి దేశాల భవిష్యత్తును ప్రకటించేటప్పుడు ప్రతివాడూ, తరతరాలుగా అనుగతంగా వస్తూన్న సంప్రదాయాలను ఒక్కసారిగా తుడిచి పెట్టడం అసంభవమనీ, ఒకవేళ సామ్యవాద విధానం మీద ఆర్థికసంస్కరణలు అమలుజరిపినా, రోజురోజుకూ పెరిగిపోతున్న జనసంఖ్యవలన వాటి ఫలితాలు భగ్నంకావచ్చుననీ, చిర కాలానుభవంతోకూడుకొన్న మన శ్వేతపాలకుల రాజ్యతంత్రజ్ఞతముందు, ఇంకా శైశవ దశలోనే ఉన్న మన నాయకుల రాజకీయ ప్రతిభ నిలవలేకపోవచ్చుననీ - బాగా గుర్తెరిగి జాగ్రతవహించవలసినఅవసరంఎంతైనా ఉంది

ఈ గ్రంథం ఒక్క భారత విద్యార్థిలోకానికీ, భారతప్రజానీకానికేగాక—అధికారుల ఆతిధ్యం పైకొద్దిరోజులు పర్యటనంచేసి గడించిన మిడి మిడి జ్ఞానంతో, తమకు సర్వమూ తెలుసు ననుకొనే విదేశపత్రికా విలేఖరులూ, రిటైరయిన బ్రిటిష్ ఉద్యోగులూ ప్రచారంచేసే కల్పనా కథలే వాస్తవమని విశ్వసించే, విదేశ ప్రజానీకానికూడా అత్యంత ఉపయుక్తం కాగలదు

(20 వ పేజీ తరువాయి)

ప్రజామంత్రుల పాలనలో మన విద్యావిధానములో యీ పడపోత విధానము ప్రజ్వరిల్లుట శోచనీయము

చేసే ఉద్యోగానికి చదివే చదువుకూ ఎక్కడా సంబంధం లేకపోవటం విద్యావిధానములో ఒకగొప్ప లోపభూయిష్టం విద్యార్థుల మానసికవికాసానికి అనుగుణ్యంగా ఉత్సాహవంతంగా, దేశానికి ఉపయోగంగా, మార్పు చేయవలసిన బాధ్యత మంత్రులపై నున్నది.

ఈ ఆపత్సమయంలో మేము ఇంజనీరింగ్ విద్యార్థులం తోటిసోదరవిద్యార్థుల సాయాన్ని అపేక్షిస్తున్నాం. మానవాభ్యుదయానికి పునాదుల్ని నిర్మించే మేం మా హక్కులను రక్షించుకొనుటకు మీ సాయాన్ని అర్థిస్తున్నాం విద్యాశాఖామంత్రిగారికి, కాలేజీ ప్రిన్సిపాలుగారికి, ప్రతిచోటా సభలు జరిపి, తీర్మానాలుచేసి మా పక్షన వారికి పంపి ఆందోళన జరుప కోరుతున్నాం.

ఉట్టి ఆంజనేయశర్మ,
ఇంజనీరింగ్ విద్యార్థి,

ప్రాచ్యజ్యోతి

★

ఓహోహో ! వీట్ - నామ్ !
విజయము నీదే నడు నడు !
వీరునివలె ముందుకేగి
క్రూరుల హతమార్చుమా !
ప్రాచ్యలోక హృదయంలో
జ్యోతివిగా వెలిగినావు
విజయము నీదే నడు నడు
నీ నామం పెదవి నిలిపి
నీకోసం ప్రతినబూని
కలకత్తా పురవీధుల
మా తమ్ములు మరణించిరి !
స్వార్థపరులు, నీచులు, ఆ
ఫ్రెంచి నిరంకుశులు నిన్ను
విలువు దోపిడీచేయగ, చెర
బట్టగ, హరియింపగ లేచినారు !
స్వాతంత్ర్యం నిలుపుకొనగ,
పారతంత్ర్య మంతరింప,
జీవన్మరణాల మధ్య
వీరునివలె తుదివరకూ
పోరాడగ తలపడితివి
విజయము నీదే నడు నడు !
ఓహోహో ! వీట్ - నామ్ !
నీపై కత్తులు దూసే నిరంకుశుల హతమార్చగ
నీ కంఠం శతఘ్నిగా
శత ధ్వనిగ పేలుతోంది !
నీ వెత్తిన ధ్వజము జూచి
నిలువున హడలెత్తి నిన్ను
'మార్క్సిస్టు పెనుభూతం'గా
చిత్రకథలు అల్లినారు !
అయినా ఇది నిజ మనుమా
ధృవమను మా వీట్ - నామ్
తూర్పులోక మొక్కటిగా
నీ కంఠగ నిలుస్తోంది !
ప్రాచ్య జ్యోతి వీట్ - నామ్‌కు !
విజయము సాధించి నడువు !!

——— ఏ సోమసుందర్

మోపుతున్నారు. యదార్థమునకు వీళ్ళు వెలపుట్లు నిల్వజేసి చేతిలోధాన్యం పెట్టుకొనిధాన్యం ధరలు తమకనుకూలంగా రాష్ట్ర ప్రభుత్వంచే మార్పుచేయించు కొనగల్గారు.

ప్రభుత్వంయొక్క యీ బలహీనపంథాను అనువుగా తీసుకొని దొంగవ్యాపారులు ఆహార కమిటీలనెల్ల ఆక్రమించారు. ఇందుచే ఆహార కమిటీలు దొంగవ్యాపారమును అరికట్టు సంస్థలగుటకుబదులు మురాకక్షలకు, దొంగవ్యాపారులకు నిలయమైనాయి. ప్రభుత్వం ధరల నిర్ణయవిషయంలోను, బ్లాకుమార్కెటు నిర్మూలన విషయంలోను, ప్రజలను సంతృప్తిపర్చు మార్గం అవలంబించ లేకపోయింది. దీని ఫలితంగా నిర్బంధ ధాన్యసేకరణయని ప్రభుత్వము రైతులపై పోలీసు ప్రయోగమునకు పూనుకొనుచున్నది ప్రభుత్వంయొక్క యీ పంథాతో నేటి తిండిదొంగయైన మిల్లుయజమాని, జమీందారు లంచగొండి ఉద్యోగులను లంచాలతో మేపి శిక్షనుతప్పించుకొంటున్నారు ప్రభుత్వ నిర్బంధం పేదరైతుపై కేంద్రీకరింపబడుచున్నది ఇది వినాశకరపంథా-ఆహార సమస్యను మరింత క్లిష్టతరం చేయుటకు మాత్రం తోడ్పడుచుంది బ్లాకుమార్కెటుదార్లకు సర్వస్వాతంత్రం ఇచ్చుటకు మాత్రమే మంత్రివర్గంయొక్క ఈ మార్గంతోడ్పడగలదు.

పరిష్కారమార్గం

యువకులం ఆహారసమస్యను ప్రజాసహకారంతో మంత్రివర్గం పరిష్కరించునట్లు ఆందోళనచేయాలి ప్రజాశత్రువులైన బ్లాకుమార్కెటు దారులను బహిరంగపర్చాలి కష్టించి పండించే రైతుకు న్యాయమైనధర ప్రభుత్వంగ్యారంటీచేయునట్లు, రైతుకు అవసరమైన గుడ్డ, వ్యవసాయ పనిముట్లు ఎరువులు ప్రభుత్వం కంట్రోలురేటుకు సప్లయిచేయునట్లు చూడాలి తిండిదొంగలను, క్రూరంగా శిక్షించునట్లు-ఆహారసమస్యా పరిష్కారమునకు ప్రజారక్షణ ఆర్డినెన్సుక్రింద నిర్బంధింపబడినరైతు నాయకులను ప్రభుత్వం విడుదలచేయునట్లు, ఆందోళన చేయాలి

ప్రభుత్వం నేడు అనుసరించుచున్న మిల్లుయజమానులను సంతృప్తిపర్చు పంథాకు స్వస్తిచెప్పాలి. ప్రభుత్వం ఆహారసమస్యా పరిష్కారమునకు పైసూచనలను అనుసరించునట్లు చేయలేకపోయినచో తిండిదొంగలు మన ఆంధ్రభూమిని మరియొక బెంగాలు చేస్తారు. మన ఆంధ్రప్రజల రక్షణకు, వివిధ అభిప్రాయములుగల యువకులం కలసి కృషిచేయవలసి యున్నది.

[illegible]

యువజన మహాసభ

★

ద్వితీయ నూజివీడు తాలూకా యువజన మహాసభ ఆటలపోటీలు జూన్ 1, 2, 3 తేదీలలో గొల్లపల్లిలో జరిగినవి తాలూకాలో పలుతావులనుండి ఆటగాండ్రు ప్రతినిధులు, ప్రేక్షకులు వచ్చారు.

చెడుగుడి పోటీలలో 9 గ్రామాలనుంచి 12 టీములు పాల్గొన్నాయి. అంతేగాకుండా బరువుమోయుట మోకు లాగుట, పొడుగు దూకుట వగైరా పోటీలలోగూడ అనేకమంది యువకులు తమ నైపుణ్యతను ప్రదర్శించారు ఈకార్యక్రమంలో కులమతభేదాలుగాని రాజకీయభేదాలుగాని అడ్డురాలేదు అన్ని రాజకీయ పక్షాలవారూ పాల్గొన్నారు ఆటగాండ్ర సమావేశంలో ఆటగాండు తమపోరపాట్లను తాము గ్రహించినట్లు తెలుపుతూంటే ఆటగాని లక్షణమిదే ననిపించి ది ఆటల కార్యక్రమం మూడు రోజులు జరిగింది. 110 మంది యువకులు పాల్గొన్నారు చెడుగుడిలో రాజారామమోహన మెమోరియల్ టీము బాపులపాడు మొదటివారుగాను, గోల్వాలా మెమోరియల్ టీము ఆగిరిపల్లివారు రెండవవారుగాను వచ్చారు

తాలూకా యువజనసంఘ ప్రతినిధుల సమావేశం గోగినేని రామమోహనరావుగారి అధ్యక్షతను మూడవతేదీ మధ్యాహ్నం జరిగింది

సమావేశమునకు 14 గ్రామాలనుండి 38 మంది ప్రతినిధులు వచ్చారు, సావంత్సరిక కార్యక్రమాన్ని అధ్యక్షులు వివరిస్తూ 110 మందికి రాత్రిపాఠశాలల ద్వారా విద్యాప్రచారం గావించబడింది. 2 సెంటర్లలో సంక్రాంతి కార్యక్రమం జరిగిందని తిరునాళ్ళ వాలంటీర్లగా ప్రజలకు చేసిన కార్యక్రమం గురించి చెప్పారు తరువాత ఈక్రింది తీర్మానాలను ఏకగ్రీవంగా తీర్మానించారు, (1) గూడవల్లి రాంబ్రహ్మం. తలిశెట్టి రామారావు. ఇంకా గాజుల్లంక పోరాటములో మరణమందిన వీరయోధులకు సానుభూతి తెలుపుతూనూ (2) ప్రస్తుత రాజకీయ పరిస్థితులలో యువకుల కార్యక్రమాన్నిగూర్చి (3) ఉపాధ్యాయుల పోరాటాన్ని బలపర్చుతూను (4) యువజనసమస్యలు - ప్రభుత్వ కర్తవ్యాన్నిగూర్చి (5) ప్రజారక్షణచట్టాన్ని రద్దుచేయాలనీ (6) బొంబాయి అభ్యుదయ రచయితల పత్రిక నయాసాహిత్య. ప్రజానాట్యమండలి ప్రదర్శనాలమీద ఇంకా సభలమీదా బొంబాయి మద్రాసు ప్రభుత్వాలు పెట్టిన ఆంక్షలను నిరసిస్తూనూ (7) మితాక్షరపద్ధతినే దేశమంతటా ప్రవేశపెట్టాలనీ(8) బందరు ప్రిన్సిపాలును ఉద్యోగంనుండి తొలగించాలనీ (9) బ్రిటిషాంధ్రలోకి నైజాం పోలీసులను రానీయరాదని తీర్మానాలు చేయబడ్డాయి

జిల్లా యువజనసంఘ కార్యదర్శి వై వి కృష్ణారావుగారు జిల్లాలో సంఘకృషినీ, ఈ తాలూకాలో సంఘకార్యక్రమాన్ని ఎలా ఆచరణలో పెట్టాలో వివరించారు. విద్యార్థి యువజనుల మాసపత్రికయైన "నవయుగ"కు అందరూ చందాలు కట్టాలనీ చెప్పారు

నూతన సంవత్సరమునకు గోగినేని రామమోహనరావుగారు అధ్యక్షులుగాను, బొందలపాటిపురుషోత్తంగారు ప్రధానకార్యదర్శిగాను, ఇంక7 గురు కార్యవర్గసభ్యులుగాను ఎన్నుకున్నారు.

రాత్రికి 100 మందితో ఊరేగింపు జరిగింది. తరువాత మాదల వెంకటేశ్వరరావు అధ్యక్షతను ... జన సంఘ కార్యదర్శి బి. పురుషోత్తంగారు యువజనపతాకమునుఎగురవేస్తూస్వాతంత్ర్యం శాంతి-అభ్యుదయ చిహ్నములుగల ఈజండా ఆశయాలను సాధించుటకొరకు యువకులు కృషి చేయాలని చెప్పారు. జిల్లావిద్యార్థిసంఘ అధ్యక్షులు దాసరి నాగభూషణంగారు సభను ప్రారంభిస్తూ విద్యార్థి యువజనుల ఆశయాలు ఒకటేనని, ఈనాడు వారిసమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందనీ చెపుతూ నేటి రాజకీయ పరిస్థితిని వివరించారు తరువాత జిల్లా యువజన సంఘ కార్యదర్శి వై వి కృష్ణారావుగారు ఉపన్యసించారు ఆ తరువాత ఆటలలో గెలుపొందిన వారికి బహుమతులు అధ్యక్షులు యిచ్చారు సభకు 3000 ప్రజలు వచ్చారు జిల్లా ప్రజానాట్యమండలివారి సీతారామరాజు బుర్రకథతో సభ ముగిసింది

★

నవయుగ

ఆగస్టు ప్రత్యేక సంచిక

'నవయుగ' ఆగస్టు సంచిక 32 పేజీలతో రవీంద్రుని, తిలక్ పేజీ ఫొటోగ్రాపులతో ప్రత్యేక సంచికగా ప్రకటించ నిర్ణయించాం 1942 ఆగస్టునాటినుండి, ఆంధ్రలో విద్యార్థి, యువజనోద్యమాలు అభివృద్ధినిగూర్చి, రవీంద్రుని, తిలక్ మహాశయుల జీవితాలు, 1942లో సామ్రాజ్యవాద తుపాకిగుండ్లకు ప్రాణా లర్పించిన వీరుల చరిత్రలు మున్నగు విషయాలపై ప్రత్యేక వ్యాసాలుంటాయి సంచిక ధర 8 అణాలు. చందాదారులకు ప్రత్యేక ఛార్జీ లేకుండానే పంపబడుతుంది "నవయుగ" పాఠకులు యీ అవకాశాన్ని ఉపయోగించుకొనుటకు వెంటనే చందాదారులుగా జేరగోర్తాము, ఏజెంట్లు వెంటనే తమ ఆర్డరులను పంపాలి

— సంపాదకవర్గం.

(1 వ పేజి తరువాయి)

బ్యాంకులో యుంచనెంచాం, మొత్తం 2500 రూ వసూలుచేయగల్గితేనే 'నవయుగ'ను ఎట్టిఅవాంతరములు లేకుండా నడప సాధ్యమవుతుంది ఈ నిధికి 'నవయుగ' పాఠకులెల్లరు శక్తికొలది తోడ్పడతారని ఆశించుతాం.

'నవయుగ' సక్రమ ఆర్థికపునాదులు కల్గియుండుటకు యీ రూ 2500 మాత్రమే చాలవు నేడున్న చందాదారులను 1500 వరకు పెంచవలసి యున్నది ప్రతి 'నవయుగ' పాఠకుడు తనకాపీకొరకు ముందుగనే చందా చెల్లించిన, యీడబ్బు 'నవయుగ' అభివృద్ధికి పెట్టుబడి పెట్టుటకు వీలవుతుంది 'నవయుగ'లో అభివృద్ధిని తీసికొనివచ్చుటకు వీలవుతుంది కనుక పాఠకు లెల్లరు చందాదారులుగా గూడజేరి 'నవయుగ' అభివృద్ధికి తోడ్పడ విజ్ఞప్తిజేయుచున్నాం,

నేటివరకు 'నవయుగ' అభివృద్ధికితోడ్పడిన మిత్రులెల్లరూ 'నవయుగ'ను యీకష్టసమయంలో ఆదుకొంటారని— ఆంధ్ర విద్యార్థులు, యువకులు 'నవయుగ' యెడ తమకున్న అభిమానాన్ని విరాళములు, వసూలు జేసి పంపుటద్వారా నిరూపించుతారని ఆశించుతాం

సంపాదక వర్గం పాఠకులు పంపేవిరాళములను కృతజ్ఞతతో స్వీకరించి 'నవయుగ' అభివృద్ధికి మరింత దీక్షతో కృషిసల్పుతామని, ఆంధ్రవిద్యార్థి యువజనోద్యమాలు 'నవయుగ'ను గూర్చి సగర్వంగా చెప్పుకొను పత్రికగా నడపకృషి జేస్తామని ప్రతిజ్ఞ జేయుచున్నాం,

★

Printed and Edited by A. K. R. B. Koteswara Rao, at the Prajasakti Press, Mogalrajapuram, Bezwada.
& Published by K. Advita Parabrahma sastri from Navayuga office, Main Road, Kottapeta, Guntur.

ఆంధ్ర ఎలక్ట్రికల్ హౌస్

హెడ్ ఆఫీసు :
బొంబాయి

బ్రాంచెస్ :
బెజవాడ
(ఏలూరు రోడ్డు)
ఏలూరు
(మెయిన్ రోడ్డు)

నవీనతకు, నాణ్యానికి మా ప్రత్యేకత :

అన్నిరకముల ఎలక్ట్రికల్ సామానులు (హోల్‌సేల్ & రిటైల్) రేడియోలు, పంకాలు (టేబిల్ & సీలింగ్) ఎలక్ట్రిక్ మోటార్లు, రిఫ్రిజిరేటర్లు, పంపింగ్ సామాన్లు, యాంప్లిఫయర్సు, మైక్ స్పేర్‌పార్ట్సు మొదలైనవి సరసమయిన ధరలకు మావద్ద దొరకును.

శుభకార్యములకు, మీటింగులకు, పాటకచ్చేరీలకు, స్పోర్ట్సు కాలకు ప్రత్యేకతగల్గి, ఆంధ్రలోకం ఆదరించిన

"దూరశ్రవణ యంత్రములు"

ఏర్పాటుచేయబడును.

వివరాలకు:

బెజవాడ లేక ఏలూరు ఆఫీసులలో కలిసికొని మాట్లాడగోరెదము.

మన సెకండరీ విద్యావిధానం

రచన : యస్. వి. నరసయ్య

విద్యలేని మనదేశంలో ఇప్పుడే చదువుయందు అభిరుచి కలిగి ముందుకొస్తున్నారు కాని స్కూళ్లు లేవు కనీసం సెకండరీ విద్యనభ్యసించాలన్నా కూడా స్కూళ్లు చాలక ఎలా ఇబ్బంది పడుతున్నది. పరిష్కారమార్గాలు ఈ పుస్తకం చదవడంద్వారా తెలుస్తుంది, అసలు విద్యావిధానం ఎలాఉండాలి? బోధన ఏవిధంగా ఉండాలి? ఉపాధ్యాయునకు, విద్యార్థికి సంబంధం ఎలాఉండాలి? స్కూళ్లవిషయమై తల్లితండ్రులు ఎటువంటి శ్రద్ధ తీసుకోవాలి మొదలగు విషయాలు చక్కగా వ్రాయబడ్డాయి, అందరూ చదవండి, వెల : 0—4—0

పృథ్వీసింగ్

సుప్రసిద్ధ దేశభక్తుని జీవితం. ఈవీరుని జీవితగాథచదివి శరీరం ఉప్పొంగని యువకుడు వుండడు భారతదేశం కొరకు తాము ఓపిన సేవ చేయాలనే ఆవేశం చదువరులలో కలిగించి తీరుతుంది వెల. 0—12—0

మానవ విజయం

మానవుడు ప్రకృతిని ఎలాజయించాడో నాగరికతను ఎలా నిర్మించాడో తెలుపు సామాజిక శాస్త్ర గ్రంథం. సుప్రసిద్ధ సోవియట్ రచయిత ఇలిన్ రచన వి.ఆర్. శాస్త్రిగారు అనువదించారు. ఇది సైన్సు గ్రంథమైనా తేలికబాషలో వ్రాయబడింది. బాల, బాలికలు, ఇంగ్లీషు గ్రంథాలు చదువలేని పెద్దలు కూడా చదివి విజ్ఞానం సంపాదించ వీలయిన చక్కని పుస్తకం వెల : 2—0—0

- ప్రజాశక్తి ప్రచురణాలయం -
- - బెజవాడ - -